ఆదివారం
09-06-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 348
పేజీలు : 8, వెల: రూ.6.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
విశాలాంధ్ర
స్థాపితం : 1952
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

డెన్మార్క్ ప్రధానిపై దాడి: దుండగుడి అరెస్టు

కోపెన్‌హగెన్: డెన్మార్క్ ప్రధాని మెట్టే ఫ్రెడెరిక్సన్‌పై దాడి కలకలం రేపింది. స్లోవేకియా ప్రధాని రాబర్ట్ ఫికోపై ఇటీవల హత్యాయత్నం జరిగిన కారణంగా డెన్మార్క్ ప్రధానిపై దాడికి ప్రాధాన్యత ఏర్పడింది. అయితే ప్రధాని క్షేమంగా ఉన్నారని అధికారిక ప్రకటన తెలిపింది. ఆమెపై దాడికి పాల్పడిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసినట్లు వెల్లడించింది. ఈ ఘటన సెంట్రల్ కోపెన్‌హగెన్‌లో జరిగిందని పేర్కొంది. కోపెన్‌హగెన్‌లోని కుల్‌టోర్వెట్ స్క్వేర్ వద్ద శుక్రవారం సాయంత్రం ప్రధాని మెట్టేపై దాడి జరిగిందని, దుండగుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారని ప్రధాని కార్యాలయం ప్రకటించింది. ఈ ఘటనతో ప్రధాని షాక్‌కు గురయ్యారని, ఆమెకు ఎలాంటి గాయాలు కాలేదని తెలిపింది.

ఈనాడు సంస్థల అధినేత రామోజీ

అస్తమయం

- రాష్ట్రపతి, నరేంద్ర మోదీ, రేవంత్, ప్రముఖుల సంతాపం
- చంద్రబాబు, లోకేశ్ దంపతులు శ్రద్ధాంజలి
- నేడు అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు
- రెండు రోజులు సంతాప దినాలుగా ప్రకటించిన ఏపీ ప్రభుత్వం

విశాలాంధ్ర బ్యూరో అమరావతి/హైదరాబాద్ :
పద్మవిభూషణ్ అవార్డు గ్రహీత, ఈనాడు సంస్థల అధినేత చెరుకూరు రామోజీరావు (88) కన్ను మూశారు. అనారోగ్య సమస్యలతో కొద్దిరోజులుగా బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లోని నానక్ రామ్ గూడలోని స్టార్ ఆసుపత్రిలో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతూనే శనివారం తెల్లవారు ఝామున 4.50 గంటలకు తుదిశ్వాస విడిచారు. ఈ నెల 5న ఆయనకు శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది తలెత్తడంతో పరీక్షించిన వైద్యులు స్టెంట్ అమర్చారు. స్టెంట్ వేసిన తర్వాత ఆయన ఆరోగ్య పరిస్థితి కొంచెం విషమంగా మారడంతో ఆసుపత్రిలో చేర్పించారు. అయితే శనివారం మృతి చెందడంతో వెంటనే ఫిల్మ్‌సిటీలోని నివాసానికి ఆయన పార్థివదేహాన్ని తరలించారు. 1936 నవంబరు 16న కృష్ణా జిల్లా పెదపారుపూడిలో చెరుకూరి వెంకటసుబ్బారావు, సుబ్బమ్మ దంపతులకు రామోజీరావు జన్మించారు. అక్కలు రాజ్యలక్ష్మి, రంగనాయకమ్మ. కుటుంబ సభ్యులు రామోజీరావుకి తొలుత ఆయన తాతయ్య

- మిగతా 2 లో

ప్రతిపక్ష నేత రాహుల్

- సీడబ్ల్యూసీ తీర్మానం
- పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్‌గా సోనియా గాంధీ

న్యూఢిల్లీ:
లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా రాహుల్‌గాంధీని నియమించాలని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తీర్మానించింది. ఈ తీర్మానాన్ని సీడబ్ల్యూసీ ఆమోదించింది. రాహుల్ గాంధీ ఉత్తర ప్రదేశ్‌లోని రాయ్‌బరేలీ, కేరళలోని వయనాడ్‌ల నుంచి లోక్‌సభ ఎన్నికల్లో విజయం సాధించారు. అలాగే, కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ పదవికి సోనియా గాంధీ తిరిగి ఎన్నికయ్యారు. పార్టీ అత్యున్నత నిర్ణయాధికార సంస్థ కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) విస్తృత సమావేశం శనివారం జరిగింది. వివిధ రాష్ట్రాలకు చెందిన కాంగ్రెస్ శాసనసభాపక్ష పార్టీ నాయకులు, ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పార్టీ పనితీరును విశ్లేషించి, దానిని బలోపేతం చేయడానికి చర్యలను సూచించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ, పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మనీశ్ తివారీ, డీకే శివకుమార్, రేవంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.
సీడబ్ల్యూసీ సమావేశం అనంతరం కాంగ్రెస్ ఎంపీ కుమారి సెల్జా మాట్లాడుతూ 'రాహుల్ గాంధీ లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా ఎన్నికవ్వాలన్నదే సీడబ్ల్యూసీ కోరిక' అని అన్నారు. ఎంపీ కేసీ వేణుగోపాల్, పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 'లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడి బాధ్యతలు తీసుకోవాలని రాహుల్ గాంధీని ఏకగ్రీవంగా అభ్యర్థించింది' అని

తెలిపారు. పార్టీ అత్యున్నత నిర్ణయాధికార సంస్థ మనోభావాలను రాహుల్ గాంధీ విన్నారని, ఈ పాత్ర చేపట్టాలా వద్దా అనే దానిపై వచ్చే రెండు, నాలుగు రోజుల్లో నిర్ణయం తీసుకుంటారని చెప్పారు. 'ప్రచార సమయంలో మేము సామాజిక, రాజకీయ న్యాయ సమస్యలను చాలా శక్తితో లేవనెత్తాము. పార్లమెంటు లోపల కూడా అది మరింత గొప్పగా కొనసాగాలి. మెరుగైన, బలమైన, అప్రమత్తమైన ప్రతిపక్షాన్ని కలిగి ఉండేందుకు రాహుల్ గాంధీ అత్యుత్తమ వ్యక్తి' అని వేణుగోపాల్ అన్నారు. .నరేంద్ర మోదీ మూడోసారి ప్రధాని కావడానికి కీలకంగా మారిన బీహార్ సీఎం నితీశ్ కుమార్‌కు ఇండియా ఐక్య సంఘటన ప్రధాని పదవి ప్రతిపాదించిందన్న వార్తలను వేణుగోపాల్ తోసిపుచ్చారు. జైరాం రమేశ్ మాట్లాడుతూ లోక్‌సభ ఫలితాలు పార్టీని పునరుజ్జీవింపజేశాయని అన్నారు. కొన్ని రాష్ట్రాల్లో పార్టీ పేలవమైన పనితీరుకు గల కారణాలను పరిశీలించేందుకు కమిటీని వేస్తామని, ఈ కమిటీ తన నివేదికను కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గేకు అందజేస్తుందని తెలిపారు. అదే సమయంలో ఆదివారం జరగనున్న మోదీ, ఇతర క్యాబినెట్ మంత్రుల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరు కావాల్సిందిగా 'ఇండియా' పార్టీలకు ఇంకా ఎలాంటి ఆహ్వానం అందలేదని జైరాం రమేశ్ ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. 'ఆహ్వానం వచ్చినప్పుడు మేము నిర్ణయం తీసుకుంటాం. అయితే ఇప్పటివరకు అంతర్జాతీయ నేతలను మాత్రమే ఆహ్వానించినట్లు తెలుస్తోంది' అని అన్నారు. కాగా, సీడబ్ల్యూసీ మరొక తీర్మానాన్ని కూడా ఆమోదించింది. కొన్ని రాష్ట్రాల్లో పార్టీ పేలవమైన పనితీరు నేపథ్యంలో ఎదుర్కొంటున్న సవాళ్లను గుర్తించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పింది. ఎన్నికల ప్రచారంలో రాహుల్ గాంధీ చేసిన కృషిని సీడబ్ల్యూసీ తీర్మానం కొనియాడింది. 'కాంగ్రెస్

- మిగతా 2 లో

ప్రజల నమ్మకాన్ని నిలబెడదాం

ఐక్యంగా ముందుకు సాగుదాం: సీడబ్ల్యూసీ భేటీలో ఖర్గే

న్యూఢిల్లీ:
పార్లమెంటు లోపల, బయటా ఇండియా ఐక్య సంఘటన సమన్వయంతో పని చేయవలసిన ఆవశ్యకత ఉందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. లోక్‌సభ ఎన్నికల తీర్పు... విభజన, ద్వేష రాజకీయాలకు 'నిర్ణయాత్మక తిరస్కరణ' అని స్పష్టం చేశారు. శనివారం ఇక్కడ కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఖర్గే మాట్లాడుతూ కొన్ని రాష్ట్రాల్లో పార్టీ శక్తి సామర్థ్యాలతో పనిచేయలేదని

- మిగతా 2 లో

కేంద్ర మంత్రివర్గంలో ఇద్దరు

- రామ్మోహన్ నాయుడుకు కేబినెట్
- పెమ్మసానికి సహాయ మంత్రి
- జనసేన, బీజేపీకి దక్కని అవకాశం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:
కేంద్రంలో కొలువుదీరబోయే ఎన్డీయే ప్రభుత్వ మంత్రివర్గంలో తొలివిడతగా తెలుగుదేశం పార్టీకి చెందిన ఇద్దరు ఎంపీలకు అవకాశం దక్కింది. ఈనెల 9వ తేదీన ఎన్డీఏ ప్రధానిగా మూడోసారి నరేంద్ర మోదీ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఆయనతో పాటు కొందరు కేంద్ర మంత్రులు కూడా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. వీరిలో ఏపీకి చెందిన ఇద్దరు ఎంపీలకు అవకాశం లభించింది. వరుసగా మూడుసార్లు శ్రీకాకుళం ఎంపీగా ఎన్నికైన కింజారపు రామ్మోహన్ నాయుడు కేబినెట్ మంత్రిగా నరేంద్ర మోదీతో పాటు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. రామ్మోహన్‌నాయుడు తండ్రి కింజారపు ఎర్రన్నాయుడు కూడా కేంద్ర మంత్రిగా పనిచేశారు. ఇప్పుడు ఆయన వారసుడిగా రామ్మోహన్ నాయుడు కేంద్ర మంత్రివర్గంలోకి తొలిసారి ప్రవేశిస్తున్నారు. అలాగే తొలిసారి గుంటూరు లోక్‌సభకు ఎన్నికైన ప్రముఖ పారిశ్రామిక వేత్త పెమ్మసాని చంద్రశేఖర్‌కు జాక్‌పాట్ తగిలింది. ఆయనను కూడా కేంద్రమంత్రివర్గంలోకి తీసుకుంటున్నారు. ఈ మేరకు వారిద్దరికీ పీఎంవో నుంచి పిలుపువచ్చినట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. చంద్రశేఖర్‌కు సహాయమంత్రిగా బాధ్యతలు అప్పగించనున్నారు. ఇక జనసేన, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరికి తొలివిడత మంత్రివర్గ కూర్పులో అవకాశం దక్కలేదు. జనసేన మంత్రివర్గంలో చేరుతుందా ? లేదా ? అన్న దానిపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఒకవేళ జనసేన అధినేత పవన్ కల్యాణ్ సుముఖత వ్యక్తం చేస్తే మచిలీపట్నం లోక్‌సభకు ఎన్నికైన సీనియర్ ఎంపీ బాలశౌరికి సహాయ మంత్రి పదవి లభించే అవకాశం దక్కుతుందంటున్నారు. ఎన్డీయే భాగస్వామి పక్షాల అధినేతలతో విడివిడిగా బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్రమంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్ శుక్రవారం సమావేశమయ్యారు. మంత్రివర్గంలో కోరుకుంటున్న పదవులు, స్థానాలపై నేతలు చర్చించారు. శనివారం కూడా మంతివర్గ కూర్పుపై కసరత్తు కొనసాగింది. టీడీపీ, జేడీ(యూ)కు అధిక ప్రాధాన్యం కలిగిన శాఖలు దక్కే అవకాశాలున్నాయని పార్టీ నేతలు చెబుతున్నారు. తొలివిడతలో ఇద్దరికి అవకాశం లభించగా, మలివిడతలో మరో ఇద్దరికి సహాయ మంత్రి పదవులు లభించే అవకాశం ఉన్నట్లు సమాచారం. మంత్రివర్గం రేసులో వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, చిత్తూరు ఎంపీ దగ్గుమల్ల ప్రసాదరావు, అమలాపురం ఎంపీ దివంగత లోక్‌సభ మాజీ స్పీకర్ బాలయోగి కుమారుడు హరీశ్ ఉన్నారు.

గెలిచి ఓడిన మోదీ

సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ



న్యూఢిల్లీ:
ప్రధాని నరేంద్రమోదీ గెలిచి ఓడాడని, ఇండియా కూటమి ఓడి గెలిచిందని సీపీఐ జాతీయ కార్యదర్శి డా.కె.నారాయణ వ్యాఖ్యానించారు. రెండు రోజుల పాటు దిల్లీలో జరిగిన సీపీఐ జాతీయ కార్యవర్గ సమావేశంలో సాధారణ ఎన్నికలపై సమీక్ష జరిగిందని తెలిపారు. సీపీఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణతో కలిసి నారాయణ శనివారం విలేకరులతో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లో ఊహించిన పరిణామాలే జరిగాయని, కానీ దేశంలో కొంత భిన్న ఫలితాలు వచ్చాయన్నారు. గతంలో కంటే బీజేపీకి ఓట్లు, సీట్లు తగ్గాయని, స్వయంగా మోదీకి సైతం మెజారిటీ తగ్గిపోయిందని అన్నారు. టీడీపీ, జేడీయూ కారణంగానే ఎన్డీయే ప్రభుత్వం రాగలుగుతోందని నారాయణ చెప్పారు. లౌకిక శక్తులు అన్నీ ఏకతాటిపైకి వస్తే మోదీ ప్రభుత్వం ఉండదన్నారు. గతంలో మోదీ రాజ్యాంగాన్ని మార్చాలని అనుకున్నాడని, ఇప్పుడు రాజ్యాంగం పుస్తకాన్ని పట్టుకొని దానిని కాపాడుతానని చెబుతున్నాడని, ఆయనలోని అపరాధభావనను ఈ ఘటన బహిర్గతం చేస్తోందన్నారు. దేశాన్ని వెనక్కి తీసుకెళ్లేందుకు మోదీ ప్రయత్నిస్తే ఈసారి ఇండియా ఐక్యసంఘటన ఊరుకోబోదన్నారు.

ఉక్రెయిన్‌పై గెలవాలంటే అణ్వస్త్రాలు అక్కర్లేదు: పుతిన్

2లో

ఇజ్రాయిల్ దురాక్రమణకు తొమ్మిది నెలలు

2లో

ఇదీ లోకం!

చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి

శరవేగంగా ఏర్పాట్లు

- కేసరపల్లిలో 20 ఎకరాల్లో సభాప్రాంగణం ముస్తాబు
- హాజరుకానున్న నరేంద్ర మోదీ, ఎన్డీఏ పక్ష నేతలు
- అత్యంత కట్టుదిట్టంగా భద్రతా ఏర్పాట్లు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి :
ఈనెల 12వ తేదీన టీడీపీ అధినేత చంద్రబాబు రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడానికి మూహుర్తం ఖరారయ్యింది. ఈ ప్రమాణ స్వీకారం కోసం కేసరపల్లిలోని ఓ స్థలాన్ని, మంగళగిరిలోని ఎయిమ్స్ దగ్గర ఉన్న మరో స్థలాన్ని మొదటగా పరిశీలించారు. అయితే ఈ రెండింటిలో గన్నవరం ఎయిర్‌పోర్టుకు దగ్గరగా కేసరపల్లిలోని స్థలాన్ని ఎంపిక చేశారు. ప్రమాణ స్వీకారానికి మరో మూడు రోజులు

- మిగతా 2 లో

నేడు మోదీ ప్రమాణస్వీకారం

దిల్లీలో భారీ భద్రతా చర్యలు

న్యూఢిల్లీ:
దేశ ప్రధానిగా నరేంద్ర మోదీ మూడోసారి ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఆదివారం సాయంత్రం 7 గంటల 15 నిముషాలకు మోదీతోపాటు కేంద్ర మంత్రివర్గంలో మరికొందరు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. మోదీ ప్రమాణస్వీకారోత్సవం సందర్భంగా ఆదివారం దిల్లీలో హై అలర్ట్ ప్రకటించారు. అయిదు కంపెనీల పారామిలటరీ సిబ్బంది, ఎన్‌ఎస్‌జీ కమాండోలు, డ్రోన్‌లు, స్నిపర్‌లతో కట్టుదిట్టమైన భద్రత సిబ్బందిని మోహరించారు. రాష్ట్రపతి భవన్‌లో మోదీ ప్రమాణ స్వీకారం జరగనున్న వేళ... ప్రాంగణం లోపల, వెలుపల మూడంచెల భద్రత ఏర్పాటు చేశారు. దిల్లీ పోలీసుల ప్రత్యేక ఆయుధాలు, వ్యూహాలు, ఎన్‌ఎస్‌జీ నుంచి కమాండోలు ప్రమాణ స్వీకారం రోజున రాష్ట్రపతి ఇంటి చుట్టూ, వివిధ

- మిగతా 2 లో

మళ్లీ ఎదురు కాల్పులు

ఆరుగురు మావోయిస్టుల మృతి

విశాలాంధ్ర-చింతూరు:
చత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణపూర్ జిల్లా ముంగడి అటవీ ప్రాంతంలో భద్రత బలగాలు, మావోయిస్టుల మధ్య ఎదురు కాల్పులు జరిగాయి. ఆరుగురు మావోయిస్టులను జవాన్లు హతమార్చారు. మృతదేహాలతో పాటు వారు ఉపయోగించే ఆయుధాలు, సామాగ్రి, విప్లవ సాహిత్యం, ఎలక్ట్రికల్ పరికరాలు, వాకిటాకీలు పెద్దఎత్తున స్వాధీనంచేసుకున్నారు. ఎదురుకాల్పుల్లో ముగ్గురు జవాన్లకు తీవ్రగాయాలయ్యాయి. వారిని హుటాహుటిన హెలికాప్టర్లో రాయపూర్‌కు తరలించారు. వివరాల్లోకి వెళ్తే... అందిన విశ్వసనీయ సమాచారం మేరకు శుక్రవారం రాత్రి బస్తర్ పరిధిలోని నారాయణపూర్, దంతివాడ, కొండగావ్, జగదల్పూర్ జిల్లాలకు చెందిన డీఆర్‌జీ, ఐటీబీపీ, సైనికులు సంయుక్తంగా మావోయిస్టులు దాగిఉన్న ప్రదేశాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. అదే సమయంలో నారాయణపూర్ జిల్లా ఓర్చా పోలీస్ స్టేషన్ పరిధిలోని తుల్తిలి-గోబెల్ గ్రామ అడవుల్లో మూడుసార్లు కాల్పులు జరిగాయి. ఆరుగురు మావోయిస్టులు మృతి చెందారు. ఒక 303, మరో 315 బోర్డు రైఫిల్, మూడు 12 బోర్ల రైఫిల్స్, ఒక బిజియల్ లాంచర్, సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు. గాయపడిన జవాన్లు ప్రాణాపాయస్థితి నుంచి బయటపడినట్టు తెలిసింది. ఈ విషయాన్ని దంతివాడ ఎస్పీ గౌరవ్ రాయ్, నారాయణపూర్ ఎస్పీ ప్రభాత్ కుమార్ ధ్రువీకరించారు. ఇంకా ఎక్కువ మంది మావోయిస్టులు మృతి చెంది ఉంటారని పోలీసులు భావిస్తున్నారు.

ఇజ్రాయిల్ దురాక్రమణకు తొమ్మిది నెలలు

గాజాలో 37 వేలకు పెరిగిన మృతులు

జెరూసలేం: గాజాలో ఇజ్రాయిల్ వైమానిక, భూతల దాడులకు తొమ్మిది నెలలయ్యాయి. ఇప్పటికే 36,731 మంది పలస్తీనియన్లు చనిపోయారు. గాయపడిన వారి సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. నుసీరత్ స్కూల్ భవనంలో ఆశ్రయం పొందుతున్న వారిపై దాడి తర్వాత వందల మంది పలస్తీనియన్లు సురక్షిత ప్రాంతాన్ని అన్వేషిస్తూ అక్కడ నుంచి తరలిపోయారని ఐక్యరాజ్య సమితి తెలిపింది. ముందస్తు హెచ్చరిక లేకుండా శిబిరంపై బాంబుల వర్షాన్ని ఇజ్రాయిల్ కురిపించినట్లు యూఎన్ఆర్‌డబ్ల్యూఏ వెల్లడించింది. తొమ్మిది నెలలుగా గాజాపై ఇజ్రాయిల్ దురాక్రమణను కొనసాగిస్తోంది. ప్రపంచ దేశాలు ఆక్షేపిస్తున్నా ఏకపక్షంగా వ్యవహరిస్తోంది. అభంశుభం తెలియని చిన్నారులను, అమాయక ప్రజలను మృత్యుఒడికి చేరుస్తోంది. ఈ మారణహోమాన్ని ఆపాలని అంతర్జాతీయ న్యాయస్థానం సైతం ఆదేశించినా ఇజ్రాయిల్ తీరులో మార్పు రాలేదు. అనుకున్నది సాధించే వరకు పోరు ఆగబోదని చెబుతోంది. హమాస్ నామరూపాలు లేకుండా చేసేంత వరకు విశ్రమించబోమని ఇజ్రాయిల్ సంకల్పించింది.

'లిస్ట్ ఆఫ్ షేమ్'లో ఇజ్రాయిల్: ఐరాస

గాజాలో మారణహోమం సృష్టిస్తున్న నేపథ్యంలో ఇజ్రాయిల్ తీరును ఐక్యరాజ్య సమితి ఖండించింది. సాయుధ పోరులో పిల్లల హక్కుల హరణకుగాను ఇజ్రాయిల్‌తో పాటు హమాస్‌ను లిస్ట్ ఆఫ్ షేమ్‌లో చేర్చింది. ఇందుకు సంబంధించిన పత్రాలను తమ వార్షిక నివేదికతో పాటు ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రస్ కార్యాలయం సమర్పించింది. లిస్ట్ ఆఫ్ షేమ్‌లో చేరిన తొలి ప్రజాస్వామ్యంగా ఇజ్రాయిల్ నిలిచిందని టైమ్స్ ఆఫ్ ఇజ్రాయిల్ పేర్కొంది. లిస్ట్ ఆఫ్ షేమ్‌లో రష్యా, ఇస్లామిక్ స్టేట్, అల్‌ఖైదా, బొకో హరామ్, అఫ్ఘనిస్థాన్, ఇరాక్, మైన్మార్, సోమాలియా, యెమెన్, సిరియా ఉన్నాయి.

ఇది అనైతిక నిర్ణయం: నెతన్యాహు

తమ దేశాన్ని లిస్ట్ ఆఫ్ షేమ్‌లో చేర్చడాన్ని ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్

నెతన్యాహు ఖండించారు. ఐక్యరాజ్య సమితి నిర్ణయాన్ని హేతుబద్ధమైనది కాదని దుయ్యబట్టారు. హమాస్ హంతకులకు మద్దతుదారుల సరసన నిలిచి ఐరాస తానుగా అంతర్జాతీయ బ్లాక్‌లిస్ట్‌లోకి వెళ్లిందని విమర్శించారు. ప్రపంచంలోనే ఎంతో నిబద్ధతగల సైన్యం ఐడీఎఫ్ అని నెతన్యాహు ప్రశంసించారు. ఐరాస అనైతిక నిర్ణయం వల్ల ఐడీఎఫ్‌లో మార్పు రాదని తేల్చిచెప్పారు. ఐరాస నిర్ణయం ఉగ్రవాదులకు, హమాస్‌కు ప్రయోజనం చేకూర్చేదిగా ఉన్నట్లు ఐరాసలో ఇజ్రాయిల్ ప్రతినిధి గిలడ్ ఎర్డన్ వ్యాఖ్యానించారు.

శరవేగంగా ఏర్పాట్లు

(మొదటిపేజీ తరువాయి)

మాత్రమే గడువు మిగిలి ఉండటంతో కేసరపల్లిలో శరవేగంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. పనులను అధికార యంత్రాంగం, టీడీపీ ప్రోగాం కమిటీ సభ్యులు దగ్గర ఉండి పర్యవేక్షిస్తున్నారు. సభా ప్రాంగణానికి నిర్మాణ సామగ్రి, వాహనాలు చేరుకున్నాయి. సుమారు 20 ఎకరాల్లో సభా ప్రాంగణ ముస్తాబవుతోంది. ఈ నెల 9వ తేదీ మూడోసారి ప్రధాన మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్న నరేంద్ర మోదీ ఈ కార్యక్రమానికి హాజరవుతున్నారు. అలాగే ఎన్డీఏ పక్ష నేతలు కూడా మరికొందరు హాజరుకానున్నారు. దీంతో ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. కేంద్రం నుంచి అదనపు బలగాలు కూడా ఇక్కడకు చేరుకుంటున్నాయి. శనివారం మధ్యాహ్నం గన్నవరం విమానాశ్రయంలోని కాన్ఫరెన్స్ హాల్లో రాష్ట్ర కార్యదర్శి రాష్ట్ర అదనపు డీజీ ఎస్.బాగ్చి, ఐజీలు రాజశేఖర్ బాబు, అశోక్ కుమార్ పోలీస్ కమిషనర్ రామకృష్ణ, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల కలెక్టర్లు డీకే బాలాజీ, ఢిల్లీ రావు, జిల్లా పోలీసు అధికారి అద్నాన్ నయీం అస్మితో కలిసి ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం కార్యక్రమం ఏర్పాట్లపై అధికారులతో సమావేశం నిర్వహించారు. సభా ప్రాంగణాన్ని శరవేగంగా చదును చేసి ముళ్లపొదలను తొలగించే పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. సభా వేదిక, బారికేడింగ్, బ్లాక్‌ల విభజన, పారిశుధ్యం ఏర్పాట్లు పక్కాగా చేయాలని, అలాగే కార్యక్రమానికి వచ్చే ప్రముఖులకు వసతి, పాసులు ఏర్పాటు చేయాలని సూచించారు. అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా అందించడంతో పాటు విద్యుత్ దీపాలు కూడా ఏర్పాటు చేయాలన్నారు. సభకు వచ్చే అతిథులకు, ప్రజలకు మంచినీరు, మజ్జిగ ప్యాకెట్లు, ఆహారం ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాటు చేయాలని, ప్రముఖులకు, ప్రజలకు, మీడియా వారికి అవసరమైన సీటింగ్ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఎంపిక చేసిన లేఅవుట్, గంగరాజు, విమానాశ్రయం, వెటర్నరీ కళాశాల, మేధా టవర్స్, పెట్రోల్ బంకు వద్ద గల పార్కింగ్ ప్రదేశాల నుంచి ప్రధాన సభకు చేరుకునేందుకు వీలుగా అప్రోచ్ రహదారులను అభివృద్ధి చేయాలని చెప్పారు. ప్రధాన మంత్రి, ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు, గన్నవరం విమానాశ్రయం నుంచి ప్రధాన సభ వేదిక వద్దకు రాకపోకలు, గవర్నర్ రాకపోకల కాన్వాయికి ఎలాంటి అడ్డంకులు లేకుండా పకడ్బందీగా ప్రణాళిక సిద్ధం చేయాలని, వైద్య శిబిరం ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన మందుల, అంబులెన్స్ సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఏలూరు జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల సంయుక్త కలెక్టర్లు గీతాంజలి శర్మ, సంపత్ కుమార్, డీఐజీ గోపీనాథ్ జెట్టి, విజయవాడ మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, విజయవాడ డీఎస్పీ అధిరాజ్ ఎస్ రానా, గన్నవరం విమానాశ్రయం డైరెక్టర్ ఎం.ఎల్.కె.రెడ్డి తదితరులు కూడా పాల్గొన్నారు.

ఉక్రెయిన్‌పై గెలవాలంటే అణ్వస్త్రాలు అక్కర్లేదు: పుతిన్

సెయింట్ పీటర్స్‌బర్గ్: ఉక్రెయిన్‌పై మాస్కో గెలుపునకు అణ్వస్త్రాలు వినియోగించాల్సిన అవసరం లేదని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ అన్నారు. అణు దాడి జరగబోదని స్పష్టం చేశారు. అణ్వాయుధాల అవసరం తనకు ఇప్పటివరకు కనిపించలేదని, దీనిపై చర్చించడాన్ని ఆపేయడం మంచిదని ప్రపంచ దేశాలకు సూచించారు. రష్యా అణు ఒప్పందాన్ని సవరించే సంకేతాలు ఇచ్చారు. భవిష్యత్‌లో అవసరమైనప్పుడు అణ్వాయుధాన్ని పరీక్షిస్తామని చెప్పారు. సెయింట్ పీటర్స్‌బర్గ్ అంతర్జాతీయ ఆర్థిక ఫోరంలో పాల్గొన్న పుతిన్ ఈ విషయాన్ని వెల్లడించారు. సుదూర లక్ష్యాలను ఛేదించగల ఆయుధాలను అందించి తమ దేశంపై ఉక్రెయిన్‌తో భీకర దాడులు చేయిస్తే మాత్రం అమెరికాను, దాని యూరోపియన్ మిత్రులపై క్షిపణులను ఎక్కిపెట్టేందుకు రష్యాకు ఎంతో సమయం పట్టబోదని పుతిన్ ఇటీవల హెచ్చరించిన విషయం తెలిసిందే.

నేటితో ముగియనున్న యూరోపియన్ పార్లమెంటు ఎన్నికలు

బ్రటిస్లావా: యూరోపియన్ పార్లమెంటు ఎన్నికలు తుది దశకు చేరుకున్నాయి. ఈనెల 6న మొదలైన ఎన్నికలు 9వ తేదీతో ముగియనున్నాయి. స్లోవేకియా, ఇటలీతో పాటు ఇతర యూరోపియన్ యూనియన్ దేశాలలో శనివారం పోలింగ్ జరిగింది. 27 సభ్యుల కూటమిలో ఆధిపత్యాన్ని రాజకీయ పార్టీలు ఆకాంక్షిస్తున్నాయి. యూరోపియన్ పార్లమెంటులోని 15 స్థానాల కోసం స్లోవేకియా ఓటేసింది. ఆదేశ ప్రధాని రాబర్ట్ ఫికోపై హత్యాయత్నంతో ఈ ఎన్నికలు ప్రభావితమయ్యాయి. ఇతర యూరప్ దేశాలపైనా ఈ ఘటన ప్రభావం కనిపించింది. ఈ పరిస్థితుల్లో ఫికోకు చెందిన లెఫ్టిస్ట్ స్మెర్ (డైరెక్షన్) పార్టీకి ప్రయోజనం ఉంటుందని విశ్లేషకులు అంచనా వేశారు.

అలాగే ఫ్రాన్స్ నుంచి నేషనల్ ర్యాలీ పార్టీ 81 సీట్లు గెలుచుకోవచ్చన్నది విశ్లేషకుల అంచనా. 76 పార్లమెంటు స్థానాల కోసం ఇటలీలో 9వ తేదీన తుది దశ ఓటింగ్ జరుగుతుంది. హంగేరిలోనూ ఆదివారం పోలింగ్ ఉంటుంది. పార్లమెంటులో 96 స్థానాల కోసం జర్మనీలో మూడు పార్టీల మధ్య హోరాహోరీ కొనసాగుతోంది.

ప్రతిపక్ష నేత రాహుల్

(మొదటిపేజీ తరువాయి)

మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ రూపొందించిన, నడిపించిన భారత్ జోడో యాత్ర, భారత్ జోడో న్యాయయాత్రల కారణంగా ఎక్కువగా ప్రత్యేకించవలసి వచ్చింది. ఆయన ఆలోచన, వ్యక్తిత్వాన్ని ప్రతిబింబించే ఈ రెండు యాత్రలు మన దేశ రాజకీయాల్లో చారిత్రాత్మక మలుపులు. లక్షలాది మంది మన కార్యకర్తలు, కోట్లాది మంది మన ఓటర్లలో ఆశ, విశ్వాసాన్ని నింపాయి. రాహుల్ గాంధీ ఎన్నికల ప్రచారం పదునైనది, చురకైనది. ఇతర వ్యక్తుల కంటే ఎక్కువగా మన గణతంత్ర రాజ్యాంగ పరిరక్షణను 2024 ఎన్నికలలో ప్రధాన అంశంగా మార్చింది. ఎన్నికల ప్రచారంలో చాలా శక్తిమంతంగా ప్రతిధ్వనించిన ఐదు న్యాయాలు-ఐదు గ్యారెంటీలు' కార్యక్రమం, రాహుల్‌జీ యాత్రల పరిణామం, అందులో ఆయన ప్రజల భయాలు, ఆందోళనలు, ముఖ్యంగా యువత, మహిళలు, రైతులు, కార్మికులు, దళితులు, ఆదివాసీలు, ఓబీసీలు, మైనార్టీల ఆకాంక్షలను ఆయన విన్నారు' అని పేర్కొంది. కాంగ్రెస్ రాజ్యసభ ఎంపీ ప్రమోద్ తివారీ మాట్లాడుతూ 'కచ్చితంగా ఆయన (రాహుల్ గాంధీ) లోక్‌సభలో ప్రతిపక్ష నేత కావాలి. ఇది మా వర్కింగ్ కమిటీ అభ్యర్థన, అతని నిర్ణయం, ధైర్యం ప్రశంసనీయం' అని అన్నారు. అంతకుముందు రాహుల్ గాంధీ కీలక పాత్ర పోషించాలని అనేక మంది పార్టీ నేతలు డిమాండ్ చేశారు. ఇదే అంశంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ఇది 140 కోట్ల మంది భారతీయుల డిమాండ్ అని అన్నారు. 'మా డిమాండ్...140 కోట్ల మంది భారతీయుల డిమాండ్ ఒక్కటే. రాహుల్ గాంధీ ప్రతిపక్ష నేతగా బాధ్యతలు చేపట్టాలి. మహిళలు, నిరుద్యోగుల కోసం రాహుల్ గాంధీ పోరాడుతున్నారు' అని తెలిపారు. గురుదాస్‌పూర్ నుంచి లోక్‌సభ ఎన్నికల్లో గెలుపొందిన కాంగ్రెస్ ఎంపీ సుఖ్‌జీందర్ సింగ్ రంధ్వా మాట్లాడుతూ రాహుల్ గాంధీ పార్లమెంట్‌లో ప్రధానికి సమాధానం చెప్పగల వ్యక్తి అని, అందుకే ఆయన లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా బాధ్యతలు చేపట్టాలని అన్నారు. 'పార్లమెంట్‌లో బలమైన ప్రతిపక్ష పాత్ర పోషిస్తాం. అవును, ప్రధాన మంత్రికి సమాధానం చెప్పగల అటువంటి ముఖం దేశానికి రావాలని మేము కోరుకుంటున్నాం. దేశం మొత్తం దీన్ని కోరుకుంటుందని నేను భావిస్తున్నాను' అని ఆయన అన్నారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ రెండవ అతిపెద్ద పార్టీగా అవతరించింది. 2019 లోక్‌సభ ఎన్నికలలో 52 నుంచి ఇప్పుడు 100 కి పెరిగింది. ఈసారి కాంగ్రెస్ తరపున 99 మంది అభ్యర్థులు విజేతలుగా నిలిచారు. గురువారం మహారాష్ట్రకు చెందిన సంగ్లీకి చెందిన స్వతంత్ర ఎంపీ విశాల్ పాటిల్ కాంగ్రెస్‌కు బేషరతుగా మద్దతు ఇవ్వడంతో దాని సంఖ్య మూడు అంకెల మార్కును తాకింది.

సీపీపీకి సోనియా తిరిగి ఎన్నిక

లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలందరితో కూడిన పార్లమెంటరీ పార్టీ (సీపీపీ)కి సోనియా గాంధీని చైర్‌పర్సన్‌గా తిరిగి ఎన్నుకున్నారు. సీపీపీ చైర్‌పర్సన్‌గా సోనియా గాంధీ పేరును మల్లికార్జున ఖడ్గే ప్రతిపాదించగా, నేతలు గౌరవ్ గొగోయ్, తారిఖ్ అన్వర్ బలపరిచారు. పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో జరిగిన సమావేశంలో ఎంపీలు ఏకగ్రీవంగా ఈ తీర్మానాన్ని ఆమోదించారు. గత లోక్‌సభలో కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ అధినేత్రిగా పనిచేసిన ఆమె మళ్లీ ఆ పదవికి ఎన్నికయ్యారు. 20 ఏళ్ల పాటు లోక్‌సభ సభ్యురాలిగా ఉన్న సోనియా ఇప్పుడు రాజ్యసభ సభ్యురాలు. సీపీపీ నాయకురాలిగా ఎన్నికయిన తర్వాత పార్టీ ఎంపీలను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ పార్లమెంటులో 'జాగ్రత్తగా, అప్రమత్తంగా, క్రియాశీలకంగా' ఉండాలని కోరారు.

సీపీపీ సభ్యులుగా కొత్త ఎన్‌డీఏ ప్రభుత్వాన్ని జవాబుదారీగా ఉంచడంలో జాగ్రత్తగా, అప్రమత్తంగా, క్రియాశీలకంగా వ్యవహరించాల్సిన ప్రత్యేక బాధ్యత మనకు ఉంది. దశాబ్ద కాలంగా పార్లమెంటును బుల్‌డోజ్ చేసినట్లుగా ఇక ఉంచకూడదు. పార్లమెంటుకు అంతరాయం కలిగించడానికి, సభ్యులను విచిత్రంగా దుర్వినియోగం చేయడానికి లేదా సరైన పరిశీలన, చర్చ లేకుండా చట్టాన్ని ముందుకు తీసుకురావడానికి అనుమతించబడదు' అని సోనియా గాంధీ తెలిపారు.

నేడు మోదీ ప్రమాణస్వీకారం

(మొదటిపేజీ తరువాయి)

వ్యూహాత్మక ప్రదేశాల చుట్టూ మోహరిస్తారు. ఐదు కంపెనీల పారామిలటరీ, దిల్లీ సాయుధ పోలీసు (డీఏపీ) జవాన్లతో సహా దాదాపు 2500 మంది పోలీసు సిబ్బందిని రాష్ట్రపతి భవన్ చుట్టూ మోహరించారు. ఈ కార్యక్రమానికి సార్క్ (సౌత్ ఆసియన్ అసోసియేషన్ ఫర్ రీజినల్ కోఆపరేషన్) దేశాల నుంచి ప్రముఖులు హాజరుకానున్న నేపథ్యంలో గత సంవత్సరం జీ20 శిఖరాగ్ర సమావేశానికి ఏర్పాటు చేసిన భద్రతనే అధికారులు కల్పించారు. ప్రమాణస్వీకారానికి హాజరయ్యే ప్రముఖులకు వారి హోటళ్ల నుంచి వేదిక వద్దకు, తిరిగి వెళ్లేందుకు నిర్దేశిత మార్గాలను ఏర్పాటు చేస్తామని పోలీసు అధికారులు తెలిపారు. ఇప్పటికే దిల్లీని నో ఫ్లయింగ్ జోన్‌గా ప్రకటించారు. జూన్ 9, 10 తేదీల్లో రెండు రోజుల పాటు ఆంక్షలు విధించారు. దిల్లీలో ఎలాంటి డ్రోన్, పారాగ్లైడింగ్, పారాజంపింగ్, రిమోట్ ఆపరేట్ చేసే పరికరాలపైనా నిషేధం విధించారు.

చేప మందు పంపిణీకి సకల ఏర్పాట్లు

పొన్నం ప్రభాకర్

విశాలాంధ్ర-హైదరాబాద్:

చేప మందు పంపిణీకి సకల ఏర్పాట్లు కల్పిస్తున్నట్లు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. స్థానిక నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో శనివారం చేపప్రసాదం పంపిణీని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మేయర్ గద్వాల విజయలక్ష్మితో కలిసి ప్రారంభించారు. పొన్నం మాట్లాడుతూ ప్రభుత్వ పరంగా చేపలతో పాటు అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ప్రతి ఏటా మృగశిరకార్తిలో బత్తిని కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో చేపమందు పంపిణీ జరుగుతుందన్నారు. గత 150 సంవత్సరాలుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. ఆస్తమా, శ్వాస సంబంధిత వ్యాధిగ్రస్తులు ఈ ఫిష్ మెడిసిన్ వేసుకుంటారని చెప్పారు. వివిధ దేశాలు, రాష్ట్రాల నుంచి చేప ప్రసాదం కోసం ప్రజలు వస్తున్నారని తెలిపారు. రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే దానం నాగేందర్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, మెట్టు సాయికుమార్ పాల్గొన్నారు.

ప్రజల నమ్మకాన్ని నిలబెడదాం

(మొదటిపేజీ తరువాయి)

వ్యాఖ్యానించారు. ప్రజలు కాంగ్రెస్‌పై విశ్వాసం ఉంచారని, నిరంకుశ శక్తులకు, రాజ్యాంగ వ్యతిరేకులకు గట్టి సమాధానం ఇచ్చారని అన్నారు. అధికార పార్టీ నియంతృత్వ, ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు మాట్లాడారని, ఇది గత పదేళ్ల రాజకీయాలను నిర్ణయాత్మకంగా తిరస్కరించడమేనన్నారు. ప్రతికూల పరిస్థితుల్లో ఎన్నికల్లో విజయం సాధించినందుకు కొత్తగా ఎన్నికయిన కాంగ్రెస్ ఎంపీలకు అభినందనలు తెలుపుతూ... భారత్ జోడో, భారత్ జోడో న్యాయయాత్రలు సాగిన ప్రాంతాల్లో కాంగ్రెస్ ఓట్లు, సీట్లు పెరిగాయన్నారు. 'ఇండియా' భాగస్వాములను కూడా ఖడ్గే ప్రశంసించారు. ప్రతిపక్షం వివిధ రాష్ట్రాల్లో తన నిర్దేశిత పాత్ర పోషిస్తుందని, ప్రతిపక్షం మరొకదానికి సహకరించిందని చెప్పారు. 'ఇండియా' బృందం కొనసాగాలన్నదే మా సంకల్పం. పార్లమెంట్‌లోనూ, బయటా సమష్టిగా పని చేయాలి' అని అన్నారు. ఎన్నికల ప్రచారంలో లేవనెత్తిన అంశాలు భారతదేశ ప్రజలను ఇబ్బంది పెడుతున్న సమస్యలని, వాటిని పార్లమెంట్‌లోనూ, బయటా లేవనెత్తుతూనే ఉండాలని పిలుపునిచ్చారు. 'ఇంకా, గతంలో విధానసభ ఎన్నికల్లో మెరుగ్గా రాణించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన రాష్ట్రాల్లో మన పనితీరును మెరుగుపరచుకోలేకపోయాం. అలాంటి ప్రతి రాష్ట్రంపై త్వరలో ప్రత్యేక చర్చలు జరుగుతాయి' అని ఆయన చెప్పారు. 'మనం అత్యవసర నివారణ చర్యలు చేపట్టాలి. ఇవి సంప్రదాయంగా కాంగ్రెస్‌కు అనుకూల రాష్ట్రాలు. మనకు అవకాశాలు ఉన్న చోట, మన ప్రయోజనాల కోసం కాకుండా మన ప్రజల ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవాలి. ఈ కసరత్తును అతి త్వరలో నిర్వహించాలని నేను ప్రతిపాదిస్తున్నాను' అని తెలిపారు. పార్టీ అధికారంలో ఉన్నా...లేకపోయినా 24 గంటలు, 365 రోజులు ప్రజల మధ్యనే కొనసాగుతుందని, వారి సమస్యలు లేవనెత్తుతామని ఖడ్గే స్పష్టం చేశారు. అవిశ్రాంతంగా పనిచేస్తున్న పార్టీ కార్యకర్తలు, నాయకులకు కాంగ్రెస్ అధ్యక్షుడు ధన్యవాదాలు తెలిపారు. సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ వాద్రాలను ప్రత్యేకంగా ప్రస్తావించారు. మణిపూర్‌లో రెండు స్థానాలను కాంగ్రెస్ గెలుచుకున్నదని పేర్కొన్న ఖడ్గే... నాగాలాండ్, అసోం, మేఘాలయలో కూడా పార్టీ గెలిచిందని చెప్పారు. 'మహారాష్ట్రలో మనం ఏకైక అతిపెద్ద పార్టీగా ఆవిర్భవించాం.

దేశ ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడటానికి అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చారు' అని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీ ఓటర్ల ప్రాబల్యం ఉన్న సీట్లతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో సీట్లు కూడా పెరిగాయని ఖడ్గే చెప్పారు. ముస్ముందు పట్టణ ప్రాంతాల్లోనూ కాంగ్రెస్ తన ఉనికి చాటుకోవాల్సిన అవసరం ఉందన్నారు. 'మనం క్రమశిక్షణతో ఐక్యంగా ఉండాలి. ప్రజలు గణనీయమైన చర్యలలో మనపై తమ విశ్వాసాన్ని తిరిగి పొందారు. మనం దానిని నిలబెట్టుకోవాలి. ఈ తీర్పును నిజమైన వినయంతో అంగీకరిస్తున్నాం' అని అన్నారు. రైతులు, వెనుకబడిన తరగతుల కోసం పనిచేస్తున్న సంస్థలు, ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, చిన్న చిన్న వ్యాపారులు, న్యాయవాదులు, మేధావులు, స్వతంత్ర మీడియా తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. సీడబ్ల్యూసీలో చర్చలు పార్టీ వేదికలోనే ఉండాలని, సమావేశంలో చర్చిస్తున్న వాటిపై 'రన్నింగ్ కామెంటరీ' ఉండకూడదని కాంగ్రెస్ అధ్యక్షుడు నాయకులను హెచ్చరించారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, పార్టీ ప్రధాన కార్యదర్శులు కేసీ వేణుగోపాల్, జైరాం రమేశ్‌తో పాటు ఇతర నేతలు చర్చల్లో పాల్గొన్నారు.

అస్తమయం

(మొదటిపేజీ తరువాయి)

రామయ్య పేరు పెట్టారు. కానీ స్కూల్‌లో మాస్టారుకు తన పేరు రామోజీరావు అని చెప్పి, తన పేరును తనే పెట్టుకున్నారు. ఆ పేరే జీవితాంతమూ కొనసాగుతోంది. రామోజీరావు 1947లో గుడివాడలో పురపాలకోన్నత పాఠశాలలో 8వ తరగతిలో చేరాడు. 1957లో ఆరవ ఫారం అక్కడే పూర్తిచేసుకుని, గుడివాడ కళాశాలలో ఇంటర్, బీఎస్సీ చదివారు. 1961 ఆగస్టు 19న రామోజీరావుకు, పెనమలూరుకు చెందిన తాతినేని వెంకట సుబ్బయ్య, వాణీదేవిల రెండవ కుమార్తె రమాదేవితో వివాహం జరిగింది. రమాదేవి అసలు పేరు రమణమ్మ కాగా పెద్దలు పెట్టిన పేరు నచ్చక ఆమె కూడా తన పేరును అలా మార్చుకుంది. రామోజీరావుతో భార్య వైపు బంధువుల్లో చిన్న బావమరిది తాతినేని వెంకట కృష్ణారావు మార్గదర్శి చిట్ ఫండ్స్ సంస్థలో డైరెక్టరుగా, తోడల్లుడు ముసునూరు అప్పారావు ఈనాడు, డాల్ఫిన్స్ హోటల్స్ మాజీ ఎండీగా కలిసి పని చేశారు. చిన్నప్పటి నుంచే విలక్షణ, సృజనాత్మకత ఉన్న వ్యక్తి రామోజీరావు. ఈనాడు దినపత్రికను ప్రారంభించి తెలుగునాట సంచలనం సృష్టించారు. 1974 ఆగస్టు 10న విశాఖ సాగర తీరంలో 'ఈనాడు' ను తొలుత ప్రారంభించారు. ప్రారంభించిన నాలుగేళ్లలోనే పాఠకుల మానసపుత్రికగా ఈనాడు మారింది. ఈనాడుతో పాటు కీలక మైలురాయిగా 'సితార' సినీ పత్రిక నిలిచింది. అలాగే రైతుల కోసం అన్నదాత పత్రికను నడిపారు. రామోజీరావు మీడియాతో పాటు అనేక వ్యాపారాలు సమర్థవంతంగా నిర్వహించారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్, ప్రియా ఫుడ్స్, కళాంజలి వంటి వ్యాపారాలతో తన వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించారు. ఇక రామోజీరావు హైదరాబాద్‌లో వేలాది ఎకరాల్లో నిర్మించిన రామోజీ ఫిల్మ్ స్టూడియో ప్రపంచ ప్రఖ్యాతి చెందింది. దీనికి గిన్నిస్ బుక్ రికార్డు కూడా లభించింది. ప్రపంచంలోనే అతిపెద్ద సినిమా స్టూడియోగా రామోజీ ఫిల్మ్ సిటీ ఉంది. 2016లో భారత ప్రభుత్వం రామోజీరావును దేశ రెండో అత్యున్నత పురస్కారమైన పద్మవిభూషణ్‌తో సత్కరించింది.

అధికారిక లాంఛనలతో నేడు అంత్యక్రియలు

రామోజీరావు అంత్యక్రియలు ఆదివారం అధికారిక లాంఛనాలతో నిర్వహించనున్నారు. ఈ విషయంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సీఎస్‌కు అందుకు కావాల్సిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లు సైతం అధికారులు చేపడుతున్నారు. అయితే రామోజీరావు మనవడు అమెరికా నుంచి ఆదివారం వస్తున్నందున ఆదివారం అంత్యక్రియలు నిర్వహించాలని నిర్ణయించారు. ప్రస్తుతం ఫిల్మ్ సిటీలో ఆయన భౌతికకాయాన్ని ఉంచారు. ఆయన పార్థివదేహానికి అనేక మంది సినీ, రాజకీయ ప్రముఖులు నివాళులర్పించారు.

నేడు, రేపు ఏపీలో సంతాప దినాలు ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం

రామోజీరావు మృతికి నివాళిగా రెండు రోజుల పాటు ఏపీ ప్రభుత్వం సంతాప దినాలు ప్రకటించింది. ఈ మేరకు అధికారిక ఉత్తర్వులను జారీ చేసింది. ఈ నెల 9, 10 తేదీలను సంతాప దినాలుగా ప్రకటిస్తూ సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా రెండు రోజుల పాటు జాతీయ పతాకాన్ని సగం వరకూ అవనతం చేయాలని సూచిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అలాగే అధికారికంగా ఏ వేడుకలూ నిర్వహించరాదని తెలిపారు.

రామోజీరావు వ్యక్తి కాదు వ్యవస్థ : చంద్రబాబు

రామోజీరావు ఒక వ్యక్తి కాదు, వ్యవస్థ అని టీడీపీ అధినేత చంద్రబాబు పేర్కొన్నారు. ఆయన తన సతీమణితో కలిసి రామోజీ పార్థీవ దేహాన్ని సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాన్య కుటుంబంలో జన్మించి అసామాన్య విజయాలు సాధించిన రామోజీరావు మరణం తీవ్ర ఆవేదనకు గురి చేసిందన్నారు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో ఉన్న ఆయన తిరిగి కోలుకుంటారని భావించానని, కానీ ఇలాంటి వార్త వినాల్సి వస్తుందని అనుకోలేదని తెలిపారు. తెలుగు వారి జీవితాల్లో అత్యంత ప్రభావవంతమైన ముద్ర వేశారు. ఆయన తెలుగు ప్రజల ఆస్తి. తెలుగు వెలుగు. ఆయన మరణం రాష్ట్రానికే కాదు దేశానికే తీరని లోటు అని చంద్రబాబు పేర్కొన్నారు. లోకేశ్ దంపతులు కూడా రామోజీ భౌతికకాయాన్ని సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారు.

తెలుగుకీర్తిని దేశస్థాయిలో చాటారు : సీఎం రేవంత్ రెడ్డి

రామోజీరావు మరణం పట్ల ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మరణం తెలుగు పత్రికా, మీడియా, వ్యాపార రంగాలకు తీరని లోటని ముఖ్యమంత్రి అన్నారు. తెలుగు జర్నలిజానికి విశ్వసనీయతను, తెలుగు మీడియా రంగానికి కొత్త పంథాను నేర్పిన ఘనత రామోజీరావుకి దక్కుతుందన్నారు. రామోజీరావు తెలుగువారి కీర్తిని దేశ స్థాయిలో చాటిన వ్యక్తిగా సీఎం కొనియాడారు. రంగం ఏదైనా విలువలకు, విశ్వసనీయతకు పెద్దపీట వేసిన వ్యక్తి రామోజీరావు అన్నారు. పత్రిక నిర్వహణ ఒక సవాల్ అనుకునే పరిస్థితుల్లో ఐదు దశాబ్దాల పాటు ఈనాడు పత్రికను నంబర్ వన్ స్థానంలో నడపడం, ఈటీవీ స్థాపనతో టీవీ మీడియా రంగానికి దశాదిశా చూపిన దార్శనికుడు రామోజీరావు అని సీఎం కొనియాడారు.

శ్రద్ధాంజలి ఘటించిన ప్రముఖులు

రామోజీరావు మృతి చెందిన విషయం తెలిసిన వెంటనే అనేక మంది రాజకీయ, పత్రిక, మీడియా సంస్థల అధినేతలు, సీనియర్ జర్నలిస్టులు, సినీ ప్రముఖులు, దర్శకులు, నిర్మాతలు ఆయన మృతి పట్ల సంతాపం, దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్, తెలంగాణ రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీతక్క, పొన్నం ప్రభాకర్, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, మల్రెడ్డి రంగారెడ్డి, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, మాజీ ఎంపీ వి.హనుమంతరావు, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు, సినీ దర్శకుడు రాజమౌళి తదితరులు నివాళులర్పించారు.

సమాజంలో రామోజీది చెరగని ముద్ర : రాష్ట్రపతి ముర్ము

రామోజీ మరణంతో మీడియా, వినోద రంగం ఓ టైటాన్‌ను కోల్పోయింది. ఈనాడు వార్తా పత్రిక, ఈటీవీ న్యూస్ నెట్‌వర్క్, రామోజీ ఫిల్మ్ సిటీ సహా అనేక సంస్థలను స్థాపించి ఎంతో మందికి మార్గదర్శకుడిగా నిలిచిన సృజనాత్మక వ్యాపారవేత్త ఆయన. తన దూరదృష్టితో ఎన్నో విజయాలు సాధించి సమాజంలో చెరగని ముద్ర వేశారు. పద్మవిభూషణ్ సత్కారం అందుకున్నారు. మీడియా, సినీ పరిశ్రమలకు ఆయన అందించిన సేవలు చిరస్మరణీయం. ఆయన కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తెలిపారు.

ఎప్పుడూ దేశాభివృద్ధి కోసమే ఆలోచించేవారు : మోదీ

రామోజీరావు మరణం ఎంతో బాధాకరం. భారతీయ మీడియాలో విప్లవాత్మక వార్పులు తీసుకొచ్చిన దార్శనికుడు ఆయన. ఆయన సేవలు సినీ, పత్రికారంగాలలో చెరగని ముద్ర వేశాయి. తన అవిరళ కృషి ద్వారా మీడియా, వినోద ప్రపంచాల్లో శ్రేష్ఠమైన ఆవిష్కరణలకు నూతన ప్రమాణాలను నెలకొల్పారు. ఆయన ఎప్పుడూ దేశాభివృద్ధి కోసమే ఆలోచించేవారు. ఆయనతో సంభాషించేందుకు, ఆయన నుంచి అపారమైన జ్ఞానాన్ని పొందేందుకు అవకాశం రావడం నా అదృష్టం. ఈ విచారకర సమయంలో రామోజీ కుటుంబ సభ్యులు, స్నేహితులు, అసంఖ్యాక అభిమానులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేయనున్న నరేంద్ర మోదీ తెలిపారు.

రామోజీ అంటేనే క్రమశిక్షణ : వెంకయ్యనాయుడు

ఆత్మీయుడు రామోజీ మరణవార్త తెలిసి దిగ్భ్రాంతికి గురయ్యా. క్రమశిక్షణ, సమయపాలన, నిబద్ధతలతో అడుగుపెట్టిన ప్రతి రంగంలో ఆయన సృష్టించిన నూతన ఒరవడి ఆదర్శనీయం. తెలుగు భాష, సంస్కృతులకు ఆయన చేసిన సేవ చిరస్మరణీయం. ఆయన ఓ వ్యక్తి కాదు. శక్తిమంతమైన వ్యవస్థ. వ్యక్తిగా మొదలై వ్యవస్థగా ఎదిగిన ఆయన జీవితం నుంచి యువతరం ఎన్నో పాఠాలు నేర్చుకోవాలి. ఆయన లేని లోటు పూడ్చలేనిదని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు పేర్కొన్నారు.

రామోజీ మరణం విచారకరం : రాహుల్ గాంధీ

భారత మీడియా రంగంలో అగ్రగామి, పద్మవిభూషణ్ రామోజీరావు మరణం విచారకరం. జర్నలిజం, సినిమా, వినోద రంగానికి ఆయన అందించిన సేవలు చెరగని ముద్ర వేశాయి. మీడియా రూపురేఖలను మార్చాయి. ఈ విచారకర సమయంలో ఆయన కుటుంబం, స్నేహితులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

విపత్తుల సమయంలో అండగా నిలిచారు : కేరళ సీఎం విజయన్

ఉత్సుకత, దూరదృష్టి, సంకల్పంతో ప్రవేశించిన ప్రతి రంగంలో రామోజీరావు చెరగని ముద్ర వేశారు. ఎంతోమందిలో స్ఫూర్తి నింపారు. కేరళలో ప్రకృతి విపత్తులు ఎదురైన సమయంలో మా రాష్ట్రానికి అండగా నిలిచారు. ఆయన మరణం యావత్ దేశానికి తీరని లోటని కేరళ సీఎం పినరయి విజయన్ తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.

తెలుగు మీడియాకు దార్శనికుడు : సీఎం మమతా బెనర్జీ

మీడియా లీడర్ రామోజీరావు మరణ వార్త దిగ్భ్రాంతికి గురిచేసింది. కమ్యూనికేషన్ ప్రపంచానికి ముఖ్యంగా తెలుగు మీడియాకు ఆయన దార్శనికుడు. వ్యక్తిగతంగానూ ఆయనతో నాకు మంచి పరిచయం ఉంది. ఓసారి నన్ను తన స్టూడియోకు ఆహ్వానించారు. ఆ జ్ఞాపకాలు ఎప్పటికీ మర్చిపోలేను. ఆయన కుటుంబానికి, శ్రేయోభిలాషులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ తెలిపారు.

రామోజీ సేవలు చిరస్మరణీయం : సీఎం స్టాలిన్

రామోజీరావు మరణం తీవ్ర విచారకరం. మీడియా, జర్నలిజం, సినీ పరిశ్రమకు ఆయన అందించిన సేవలు చిరస్మరణీయం. ఈ కష్ట సమయంలో ఆయన కుటుంబ సభ్యులు, స్నేహితులు, అభిమానులకు సానుభూతి తెలియజేస్తున్నానని తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ తెలిపారు.

రామోజీ మరణం విచారకరం : అమిత్‌షా

మీడియా దిగ్గజం రామోజీరావు మరణం విచారకరం. మీడియా నుంచి ఫైనాన్స్ వరకు... విద్య నుంచి పర్యాటకం వరకు తాను పనిచేసిన అనేక రంగాల్లో తన సృజనాత్మకతతో ఎన్నో సానుకూల ప్రమాణాలను తీసుకొచ్చారు. ఇప్పుడు భౌతికంగా మన మధ్య లేకపోయినా... ఆయన కృషి తరతరాలకు స్ఫూర్తినిస్తుందని కేంద్ర మాజీ హోం శాఖ మంత్రి అమిత్ షా పేర్కొన్నారు.

పెన్నులంటే ఆయనకు చాలా ఇష్టం : చిరంజీవి

రామోజీ ఫిల్మ్‌సిటీలో ఆయన పార్థివదేహానికి నివాళులర్పించిన తర్వాత చిరంజీవి మాట్లాడుతూ రామోజీరావుకు పెన్నులు అంటే చాలా ఇష్టం. ప్రజారాజ్యం పార్టీ నడుపుతున్న సమయంలో ఆయనకు ఒక పెన్ను బహూకరించా. దాన్ని చూసి మురిసిపోయారు. ఆయన దగ్గరున్న పెన్నుల కలెక్షన్ నాకు చూపించారు. తన ఆలోచనలకు తగినట్లుగా వాటిని వినియోగిస్తూ అక్షర రూపంలో పెట్టేవారు. ఆశయాలను నెరవేర్చుకునేందుకు ఆయన చేసే ప్రయత్నం అంతా ఇంతా కాదు. ఆయన మృతి తెలుగు జాతికి తీరని లోటు. ఒక మహావ్యక్తిని, శక్తిని కోల్పోయాం అని చిరంజీవి అన్నారు.

ప్రమాణ స్వీకారం తర్వాత కలుద్దామనుకున్నా : పవన్ కల్యాణ్

రామోజీరావు పార్థివదేహానికి జనసేన అధినేత పవన్ కల్యాణ్, దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్, నిర్మాత రాధాకృష్ణ (చినబాబు) నివాళులర్పించారు. పవన్ మాట్లాడుతూ ప్రమాణ స్వీకారం తర్వాత వచ్చి ఆయన్ను కలుద్దామనుకున్నా. కానీ ఇంతలోనే దురదృష్టవశాత్తూ కన్నుమూశారు. తెలుగు రాష్ట్రాల్లో ఉన్న వేలాది మంది జర్నలిస్టులు ఈనాడు జర్నలిజం స్కూల్ నుంచి వచ్చిన వారే. తెలుగు చిత్ర పరిశ్రమ అభివృద్ధికి ఎంతో చేశారు. అత్యున్నత ప్రమాణాలతో గొప్ప ఫిల్మ్‌సిటీని నిర్మించారు. ఆయన మృతి తెలుగు రాష్ట్రాలకు తీరని లోటని పేర్కొన్నారు.

రామోజీ మృతికి జగన్ దిగ్భ్రాంతి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రామోజీ గ్రూప్ సంస్థల అధినేత రామోజీరావు మరణంపై వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం ఆయన ట్వీట్ చేస్తూ, రామోజీ మరణం తనను దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. తెలుగు పత్రికారంగానికి దశాబ్దాలుగా ఆయన ఎనలేని సేవలందించారని పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడ్ని ప్రార్థించారు. రామోజీ కుటుంబానికి జగన్ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

సీపీఎం నేతలు సీతారామ్ ఏచూరి, బీవీ రాఘవులు సంతాపం

ఈనాడు సంస్థల అధినేత, ప్రముఖ వ్యాపారవేత్త రామోజీరావు మృతి బాధాకరమని సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారామ్ ఏచూరి, పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు పేర్కొన్నారు. రామోజీ మృతికి వారు సంతాపం తెలిపారు. రామోజీరావు తెలుగు మీడియా రంగానికి నూతన వరవడి దిద్దారని, పత్రికా విలువలు నిలబెట్టడంలో ఆయన ఎంతో కృషి చేశారన్నారు. ఆయన సుందరయ్య, రాజేశ్వరరావు వంటి ప్రముఖ కమ్యూనిస్టు నాయకులను ఎంతో అభిమానించేవారని తెలిపారు.

స్ఫూర్తిప్రదాత రామోజీరావు

విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఏపీయూడబ్ల్యూజే నివాళి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: మీడియా మొఘల్, ఈనాడు సంస్థల అధినేత, పద్మవిభూషణ్ అవార్డు గ్రహీత చెరుకూరి రామోజీరావు మరణం పత్రికా రంగానికే కాక, తెలుగు రాష్ట్రాలకు తీరని లోటని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు ఐవీ సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి చందు జనార్ధన్ ఆవేదన వ్యక్తం చేశారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళుర్పించారు. తెలుగు జర్నలిజానికి జాతీయ స్థాయి గుర్తింపు, గౌరవాన్ని తీసుకురావడమేగాక, జిల్లా పేజీలతో స్థానిక వార్తలకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి తెలుగు పత్రికారంగంలో నూతన ఒరవడికి శ్రీకారం చుట్టిన స్ఫూర్తి ప్రదాత అని కొనియాడారు. తెలుగు భాష సంరక్షణకు, సాహిత్యాభివృద్ధికి విశేష కృషి చేశారని, రంగం ఏదైనా విలువలకు, విశ్వసనీయతకు పెద్దపీట వేశారని రామోజీరావును నాయకులు శ్లాఘించారు. ఏపీయూడబ్ల్యూజే విజయవాడ యూనిట్ అధ్యక్షులు చావా రవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జయప్రకాశ్, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కంచల జయరాజ్, ఐజేయూ సభ్యులు షేక్ బాబు, స్టేట్ కౌన్సిల్ సభ్యులు దారంవెంకటేశ్వరరావు, సామ్నా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ రమణారెడ్డి, ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ నాయకులు సాంబశివరావు, విజయవాడ యూనిట్ కార్యవర్గ సభ్యులు రత్నాకర్, హుస్సేన్, కుమార్, శ్రీనివాస్, భద్రం, నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు సంస్కృతికి ప్రతిబింబం రామోజీరావు

నారాయణ సంతాపం

న్యూఢిల్లీ: తెలుగు సంస్కృతికి ప్రతిబింబం రామోజీరావు అని, ఆయన ప్రతిబింబం ఉట్టిపడే విధంగా నూతన ప్రభుత్వం జాతికి ఉపయోగపడే స్మారకాన్ని నిర్మించాలని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ అన్నారు. దిల్లీలో సీపీఐ ఏపీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణతో కలిసి శనివారం మీడియాతో మాట్లాడుతూ రామోజీరావు మరణం పట్ల సంతాపం తెలియజేశారు. ఆయన పేరు చెప్పగానే అంతర్జాతీయ స్థాయిలో ఫిలింసిటీ, గ్రామీణ స్థాయిలో ఈనాడు పేపర్ గుర్తుకువస్తుందని అన్నారు. ఆయన ప్రగతిశీలవ్యక్తి అని, తొలిదశలో వామపక్ష ఉద్యమాలలో, ముఖ్యంగా ఏఐవైఎఫ్‌లో ఉన్నారని గుర్తు చేశారు. తరువాత కూడా సీపీఐ, వామపక్షాలతో సంబంధాలు ఉన్నాయని తెలిపారు. వ్యక్తిగతంగా ఆయన కుటుంబంతో తమకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయని నారాయణ తెలిపారు. ఆరు నెలల క్రితం తనను కలిసినప్పుడు చంద్రబాబు ఒంటరిగా పోటీ చేసినా 135 స్థానాలలో గెలుస్తారని చెప్పారని, ఇప్పుడు చంద్రబాబును ముఖ్యమంత్రిగా చూడకుండానే మరణించడం బాధాకరమని అన్నారు.

సీఆర్ ఫౌండేషన్‌పై మక్కువ

కమ్యూనిస్టు దిగ్గజం చంద్ర రాజేశ్వరరావు ఫౌండేషన్ అధ్వర్యంలో వృద్ధాశ్రమం నిర్మాణం సందర్భంగా రామోజీరావు సలహాలు ఇవ్వడమే కాకుండా... ఆ రోజుల్లో రూ.5 లక్షలు విరాళం ఇచ్చారని నారాయణ గుర్తు చేశారు. ఆయనకు చంద్ర రాజేశ్వర రావు అయినా, వృద్ధాశ్రమం అయినా మక్కువ ఎక్కువ అని అన్నారు. రామోజీరావు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

యువతకు రోల్ మోడల్: ముప్పాళ్ల

పద్మవిభూషణ్ పురస్కార గ్రహీత రామోజీరావు మరణవార్త యావత్తు తెలుగు ప్రజలతోపాటు దేశ విదేశాల్లోని కోట్లాది మందిని శోకసంద్రంలోకి తీసుకెళ్లిందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. యువత... ప్రత్యేకించి విద్యావంతులు క్రియాశీలకమైన ఏదో ఒక రంగంలో రాణించాలని, తనతోపాటు సమాజానికి ఉపయోగపడాలని, స్వశక్తితో అనేక మందికి ఉపాధి కల్పించాలనే జిజ్ఞాశ కలిగిన యువతకు రామోజీరావు ఒక రోల్ మోడల్ అని పేర్కొన్నారు. ఆయన ఒక సాధారణ కుటుంబంలో పుట్టి, స్వీయశక్తితో దేశం గర్తించగల స్థాయికి గొప్ప పారిశ్రామిక వేత్తగా ఎదిగారని కొనియాడారు. అంతకుమించి గొప్ప జర్నలిస్టుగా, మానవతా వాదిగా, రాష్ట్ర పురోభివృద్ధిని అనుక్షణం కాంక్షించే వ్యక్తిగా తెలుగు ప్రజలు ఉన్నంత కాలం ఆయనను గుర్తుంచుకుంటారని తెలిపారు. రామోజీరావు యవ్వన దశలో కమ్యూనిస్టు పార్టీ సభ్యుడిగా ఉండటం, నేటికీ ఆ భావజాలాన్ని పుణికిపుచ్చుకుని రాష్ట్ర, దేశ పురోభివృద్ధికి ప్రతిక్షణం పాటుపడిన ఆయనకు పార్టీ రాష్ట్ర సమితి తరపున, వ్యక్తిగతంగా జోహార్లు అర్పిస్తున్నట్టు చెప్పారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

రైతుసంఘం సంతాపం

రామోజీరావు మృతికి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం తరపున ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.ఈశ్వరయ్య, కేవీవీ ప్రసాద్ ప్రగాఢ సంతాపం ప్రకటించారు. తెలుగు చరిత్రలో ఎప్పటికీ చెదిరిపోని సంతకం ఆయనదని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పలిశెట్టి దామోదరరావు, జీవీ నరసయ్య సంతాపం తెలిపారు. రామోజీ ఆశయాలు, మేథస్సు నేటి యువతకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు.

సాగునీటి ప్రాజెక్టులను సత్వరం పూర్తి చేయాలి: కేవీవీ ప్రసాద్

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ఎన్టీఆర్ జిల్లాలో చింతలపూడి, వేదాద్రి ఎత్తిపోతల పథకాలు పూర్తి చేయనందున లక్షలాది ఎకరాలు బీడు భూములుగా మారుతున్నాయని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వి.వి.ప్రసాద్ అన్నారు. స్థానిక దాసరి భవనంలో శనివారం రైతుసంఘం జిల్లా కమిటీ సమావేశం సంఘ అధ్యక్షుడు మల్నీడు యల్లమందారావు అధ్యక్షతన జరిగింది. కేవీవీ మాట్లాడుతూ... నూతన ప్రభుత్వం సత్వరమే సాగునీటి ప్రాజెక్టులపై దృష్టి సారించి పూర్తి చేయాలన్నారు. ఈ నెల 22న ఏరువాక పౌర్ణమి సందర్భంగా ఖరీఫ్ సాగుకు సిద్ధమౌతున్న రైతాంగాన్ని ప్రోత్సహించాలన్నారు. వ్యవసాయ యంత్ర పరికరాలను 75 శాతం సబ్సిడీపై అందించాలని డిమాండ్ చేశారు. ఎద్దులు, దున్నపోతుల కొనుగోలుకు ఆర్థిక సహాయం అందించాలన్నారు. సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ మాట్లాడుతూ వ్యవసాయ రంగం మూడు దశాబ్దాలుగా పాలకులు అవలంభిస్తున్న విధానాల వల్ల తీవ్ర సంక్షోభంలో ఉందన్నారు. రైతుల ఆత్మహత్యలు నిత్యకృత్యం అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. పంట రుణాలు మూడు లక్షల వరకు జీరో వడ్డీతోను, ఐదు లక్షల వరకు పావలా వడ్డీకి ఇచ్చి రైతాంగాన్ని ఆదుకోవాలన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్టు, స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 60 ఏళ్లు నిండిన రైతులకు రూ.10 వేల పెన్షన్ ఇవ్వాలని కోరారు. ఈనాడు సంస్థల అధినేత రామోజీరావు, ఏఐకేఎస్ జాతీయ అధ్యక్షుడు అతుల్ కుమార్ అంజన్, మాజీ మంత్రి ఎర్నేని సీతారత్నం, మెరుగు విజయ్ కుమార్, శ్రీరంగం వెంకట రమణ, నడకుదుటి సూర్యప్రకాష్‌రావుకు సంతాప సూచకంగా మౌనం పాటించారు. డి.జమలయ్య, చుండూరు సుబ్బారావు, బుడ్డి రమేశ్, తూము కృష్ణయ్య, ఎన్.వనమాలి, చెరుకూరి సుబ్బారావు, పత్రి హరికృష్ణ, పొల్నీడి నాగభూషణం, కోయా సుబ్బారావు, డి.సాంబ శివరావు, పి.నరసింహారావు పాల్గొన్నారు.

వర్ధంతి సభలను విజయవంతం చేయాలి: జంగాల

విశాలాంధ్ర-పెదనందిపాడు: సీపీఐ నేతలు బాలినేని సుబ్బారావు, బాలినేని అన్నపూర్ణమ్మ, బొగ్గవరపు బాపనయ్య వర్ధంతి సభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ గుంటూరు జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్ పిలుపునిచ్చారు. ఉప్పలపాడులో శనివారం సీపీఐ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జంగాల మాట్లాడుతూ... ర్యాలీ నిర్వహించి ఈ నెల 19న జరిగే వర్ధంతి కార్యక్రమంలో గ్రామస్థులందరినీ భాగస్వాములను చేయాలన్నారు. దివంగత నేతలు పార్టీకి చేసిన సేవలను గుర్తించి వారి వర్ధంతి సభలను నిర్వహించడం ద్వారా వారిపై పార్టీకి ఉన్న అభిమానాన్ని చాటుతుందన్నారు. ఫొటోలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి వారి విశిష్టతను గ్రామ ప్రజలకు తెలియజెప్పాలని కోరారు. సీపీఐ ప్రత్తిపాడు నియోజకవర్గ కార్యదర్శి రామిశెట్టి ఆదేశరావు మాట్లాడుతూ కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయడానికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఏ అరుణ్ కుమార్, సీపీఐ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కొల్లి రంగారెడ్డి, సహాయ కార్యదర్శి ఎస్.వీరాంజనేయులు, సీపీఐ చిలకలూరిపేట ఏరియా కార్యదర్శి సుబ్బాయమ్మ, ఉప్పలపాడు గ్రామ కార్యదర్శి బి.బ్రహ్మయ్య, రామారావు పాల్గొన్నారు.

పంట రుణాలకు ప్రత్యేక ప్రణాళిక ప్రకటించాలి

జమలయ్య

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కౌలు రైతులకు పంటరుణాలు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా రుణ ప్రణాళికను ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య డిమాండ్ చేశారు. విజయవాడ దాసరిభవన్‌లో కౌలు రైతుల సంఘం ఎన్టీఆర్ జిల్లా కమిటీ సమావేశం బుడ్డి రమేశ్ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జమలయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో ఖరీఫ్ సీజన్‌లో రూ.99 వేల కోట్ల పంట రుణాలు ఇస్తామని చెప్పి కేవలం రూ.ఐదు వేల కోట్లు మాత్రమే ఇస్తామని చెప్పటం దారుణమన్నారు. దామాషా ప్రకారం సున్నా వడ్డీకే పంటరుణాలు అందించాలి కోరారు.

ప్రజల నుంచి సేకరిం చిన డిపాజిట్లలో 40 శాతం వ్యవసాయానికి రుణాలు ఇవ్వాలని ఆర్‌బీఐ నిబంధనలు ఉన్నాయని వివరించారు. ఇందులో 20 శాతం పంట రుణాలు ఇవ్వాలని ఉందన్నారు. కేవలం 11శాతం మాత్రమే ఇస్తున్నారని, పంట రుణాలు కూడా సంపన్న ధనిక రైతాంగమే కాజేస్తున్నారని విమర్శించారు. చిన్న, సన్న కారు రైతులు, కౌలు రైతులు ప్రైవేటు వడ్డీ వ్యాపారులపై ఆధారపడి అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి పంటలు పండిస్తున్నారన్నారు. సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ మాట్లాడుతూ జిల్లాలో కౌలురైతులు ఘణనీయమైన సంఖ్యలో ఉన్నారని, వారందరికీ వ్యవసాయ పథకాలు వర్తింపు చేసే విధంగా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని కోరారు. రబీలో కరవు వల్ల దెబ్బతిన్న పంటలకు ఇప్పటివరకు నష్టపరిహారం ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. బీమా పరిహారం, పెట్టుబడి రాయితీ చెల్లించి కౌలురైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. సంఘం జిల్లా కార్యదర్శి మేకల డేవిడ్ మాట్లాడుతూ కౌలు గుర్తింపు కార్డులు వెంటనే జారీ చేసి విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు వ్యవసాయ యంత్ర పరికరాలు 90 శాతం సబ్సిడీతో అందించాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పెయ్యల వెంకటేశ్వరరావు, ముచ్చింతల వెంకటేశ్వరరావు, ఎ.శ్రీనివాసరాజు, పి.నరసింహారావు, దాసరి సాంబశివరావు, పి.నాగభూషణం పాల్గొన్నారు.

ప్రత్యేక హోదా, విభజన హామీల అమలుకు

కేంద్రంపై ఒత్తిడి తేవాలి: బాబురావు

విశాలాంధ్ర-గుంటూరు: నూతన ప్రభుత్వం ప్రత్యేక హోదా, విభజన హామీల అమలుకు కేంద్రంపై ఒత్తిడి తేవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబురావు అన్నారు. స్థానిక బ్రాడిపేటలోని జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వై.నేతాజి అధ్యక్షత శనివారం జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో బాబురావు మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీల అమలుకు నిధులు కేటాయిస్తామని గత ప్రభుత్వాలు హామీ ఇచ్చినా ఆచరణలో అమలు జరగలేదన్నారు. వెంటనే రాజధాని పనులు చేపట్టాలని, ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. పోలవరం నిర్వాశితులకు పరిహారం చెల్లించాలని, మెగా డీఎస్సీ ప్రకటించాలని, సీపీఎస్ రద్దు చేయాలని కోరారు. రాష్ట్ర కమిటీ సభ్యుడు వి.కృష్ణయ్య మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో విత్తనాలు, ఎరువులు రైతు భరోసా కేంద్రాల ద్వారా అందుబాటులో ఉంచాలని, కాల్వల్లో పూడిక, తూటకాడ, గుర్రపుడెక్క తొలిగించి, నీటి పారుదలకు అడ్డంకులు లేకుండా చేయాలని కోరారు. పార్టీ జిల్లా కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతూ పెదవడ్లపూడి హైలెవల్ ఛానల్‌ను పూర్తిచేయాలని, గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకు పొడిగించేందుకు నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఈమని అప్పారావు, ఎం.రవి, ఎస్.ఎస్. చెంగయ్య, కె.నళినీకాంత్, డి.వెంకటరెడ్డి, బి.వెంకటేశ్వర్లు, ఎల్.అరుణ, బి.కోటేశ్వరి పాల్గొన్నారు.

'భారత గౌరవ్ రైలు' ప్రారంభం

విశాలాంధ్ర, హైదరాబాద్: భారతీయ రైల్వేలు భారతదేశం యొక్క గొప్ప సాంస్కృతిక వారసత్వం, అద్భుతమైన చారిత్రక ప్రదేశాలను సందర్శింప చేయడానికి ప్రారంభించిన థీమ్-ఆధారిత టూరిస్ట్ సర్క్యూట్ రైలు ఈ భారత్ గౌరవ్ రైలు. ఈ రైలు ప్రయాణికుల నుండి ఎంతో భారీ ఆదరణ పొందింది. శనివారం "అయోధ్య-కాశీ పుణ్య క్షేత్ర యాత్ర "భారత్ గౌరవ్ రైలు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుండి మరోసారి ప్రారంభించ బడింది. 19వ భారత్ గౌరవ్ రైలును ప్రయాణికులలో సీనియర్ సిటిజన్‌లైన దినేష్ చుట్కే (75) సాధనా చుట్కే(63)లు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి జండా ఊపి ప్రారంభించడంతో ప్రయాణం ప్రారంభమైంది. ఇండియన్ రైల్వేస్ క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్ సీటీసీ) గ్రూప్ జనరల్ మేనేజర్ పీ.రాజ్ కుమార్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. "అయోధ్య-కాశీ పుణ్య క్షేత్ర యాత్ర" భారత్ గౌరవ్ రైలు 716 మంది పర్యాటకులను 100% పూర్తి ఆక్యుపెన్సీతో బయలుదేరింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రైలు ప్రయాణీకులందరికీ కొత్తగా నిర్మించిన రామ జన్మభూమి (అయోధ్య), జ్యోతిర్లింగాలలో ఒకటైన (కాశీ విశ్వనాథ్ ఆలయం) దర్శనానికి ఆధ్యాత్మిక జ్ఞానోదయం కోసం లేదా గయలో పిండ తర్పణం చేయడానికి ఇది అపూర్వ అవకాశాన్ని అందిస్తుంది. సికింద్రాబాద్‌తో పాటు, రెండు తెలుగు రాష్ట్రాలలో కాజీపేట (వరంగల్), ఖమ్మం, విజయ వాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, వైజాగ్(పెందుర్తి), విజయనగరం వంటి 8 ప్రదేశాలలో ఈ రైలులో ఎక్కే/దిగే సౌకర్యాన్ని అందిస్తుంది.

జాంబియా బృందం... ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల పరిశీలన

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించి తమ దేశంలో అమలు చేసేందుకు జాంబియా దేశ ప్రతినిధి బృందం రాష్ట్రంలో పర్యటిస్తోంది. ఈ నెల ఏడో తేదీన ఇక్కడికి చేరుకున్న ప్రతినిధి బృందం 21వ తేదీ వరకు అనంతపురం జిల్లాలో వివిధ ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను పరిశీలిస్తుంది. జిల్లా కేంద్రంలోని ఏపీసీఎన్ఎఫ్ ప్రాజెక్టు కార్యాలయంలో ప్రాజెక్టు జిల్లా మేనేజర్, రైతు సాధికార సంస్థ చీఫ్ టెక్నాలజీ, ఇన్నోవేటివ్ ఆఫీసర్ లక్ష్మానాయక్ అధ్వర్యంలో శిక్షణ పొందడంతో పాటు క్షేత్ర పర్యటనలో వివిధ ప్రకృతి వ్యవసాయ నమూనాలపై క్షుణ్ణంగా అధ్యయనం చేస్తారు. ప్రభుత్వ వ్యవసాయ మంత్రిత్వ శాఖ తరపున సయామిస్ ముండియాతో పాటు వ్యవ సాయ కళాశాలకు చెందిన మరో ఇద్దరు శిక్షణాధికారులు, కేఏటీసీ ప్రతినిధి క్లాస్ రెన్వాల్డ్, మరో 11 మంది రైతు ప్రతినిధులు, వీఎల్ఎఫ్ తరపున మోడేస్తర్ చనసాతో పాటు మరో ఐదుగురు ప్రతినిధులు పర్యటనలో ఉన్నారు. ఏపీసీఎన్ఎఫ్ ప్రాజెక్టు అమలుచేస్తున్న 'లెర్నింగ్ బై డూయింగ్' విధానంలో జాంబియా ప్రతినిధి బృందం రెండు వారాల పాటు ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాల అమలులో భాగస్వాములై పరిశీలిస్తారు.

రేపు బీటీఏ రాష్ట్ర కార్యవర్గ సమావేశం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: బహుజన టీచర్స్ అసోసియేషన్ (బీటీఏ) రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని ఈనెల 10న ఉదయం 10 గంటలకు విజయవాడ బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించ నున్నట్లు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.మనోజ్‌కుమార్, సిహెచ్.రమేశ్ శనివారం తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హాజరు కావాలని కోరారు. సంఘం నిర్మాణంతోపాటు నూతన ప్రభుత్వ విద్యా వ్యవస్థలో తీసుకురావాల్సిన మార్పులపై సమావేశంలో చర్చిస్తామన్నారు.

ఏపీ ఈఏపీసెట్ కౌన్సెలింగ్ జాప్యమేనా?

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్ర ప్రదేశ్‌లో ఈ విద్యా సంవత్సరమూ ఏపీఈఏపీసెట్ (2024) కౌన్సెలింగ్ మరింత ఆలస్యమయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఏపీలో నూతన ప్రభుత్వం రావడంతో దీనికి ప్రధాన కారణంగా ఉంది. ఏపీ ఈఏపీసెట్‌కు దాదాపు 3 లక్షల మంది పరీక్షలు రాశారు. ఇందులో ఇంజినీరింగ్ అభ్యర్థులు అధికంగా ఉన్నారు. వాటి ఫలితాల కోసం విద్యార్థులు ఎదురు చూస్తున్నారు. మన కంటే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం టీఎస్ఈఏపీసెట్‌లో ముందజంలో ఉంది. దీంతో జులైలో ఏపీఈఏపీసెట్ కౌన్సెలింగ్ కొనసాగే అవకాశాలున్నాయి. కౌన్సెలింగ్ ఆలస్యం కారణంగా ఈ ఏడాది కూడా విద్యార్థులు ఇతర ప్రాంతాల యూనివర్సిటీలు, కళాశాలలకు తరలిపోయేందుకు సిద్ధమయ్యారు. అటు ప్రైవేట్, డీమ్డ్ విశ్వవిద్యాలయాల్లో ఇప్పటికే ప్రవేశాలు ప్రారంభమయ్యాయి. త్వరలో తరగతులనూ ప్రారంభించనున్నారు. ఏపీ ఈఏపీసెట్ కౌన్సెలింగ్ ద్వారా ప్రవేశాలు పొందే వారికి మరో రెండు నుంచి మూడు నెలలపాటు ఆలస్యం అయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. పేద, మధ్యతరగతి వర్గాల విద్యార్థులంతా అధికంగా ఏపీఈఏపీసెట్ కౌన్సెలింగ్‌పైనే ఆధారపడి ఉంటారు. దీని ద్వారా కన్వీనర్ కోటాలో ప్రవేశాలు పొందిన వారికి ఫీజు రీయింబర్స్‌మెంట్ సౌకర్యాలు ఉంటాయి ఏపీ ఈఏపీసెట్ ఫలితాలను అధికారులు త్వరగా వెల్లడించి, కౌన్సెలింగ్‌ను నిర్వహించాలని కోరుతున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ సౌకర్యాలు లేని వారంతా ఏపీతో పాటు తెలంగాణ, కర్నాటక, తమిళనాడు తదితర రాష్ట్రాల్లోని డీమ్డ్, ప్రైవేట్ విశ్వవిద్యాలయాలను ఆశ్రయిస్తున్నారు. ఇప్పటికే తమకు నచ్చిన ఇంజినీరింగ్ బ్రాంచీలలో సీట్లు పొందుతున్నారు.

పాఠ్యపుస్తకాల పంపిణీకి మరో పది రోజులు

ప్రభుత్వ పాఠశాలల్లో పాఠ్యపుస్తకాల పంపిణీకి మరో పది రోజుల సమయం పట్టే అవకాశం ఉందని తెలిసింది. గత ప్రభుత్వం నిర్ణయించిన తేదీల ఆధారంగా ఈనెల 12వ తేదీ నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. అప్పటివరకు పాత పాఠ్యపుస్తకాల ఆధారంగానే బోధన కొనసాగాలి. ఈనెల 10వ తేదీలోగా పాఠ్యపుస్తకాలను అందజేయాలన్న లక్ష్యంతో పాఠశాల విద్య ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ నేతృత్వంలో చర్యలు తీసుకున్నారు. ఇంతలో నూతన ప్రభుత్వం రావడంతో పరిపాలనా పరమైన సాంకేతిక అంశాలు ఎదురయ్యాయి. కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక పాఠ్యపుస్తకాల పంపిణీపై త్వరలో స్పష్టత రానుంది.

మెగా డీఎస్సీ... ఏపీకి హోదా

- చంద్రబాబుకు పరుచూరి రాజేంద్ర బాబు, దోనేపూడి శంకర్ డిమాండ్
- జులై 27, 28 తేదీల్లో ఏఐవైఎఫ్ జిల్లాస్థాయి తరగతుల జయప్రదానికి పిలుపు

విశాలాంధ్ర -విజయవాడ (వన్‌టౌన్): మెగా డీఎస్సీ ప్రకటిస్తామని ఇచ్చిన ఎన్నికల హామీకి టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు కట్టుబడాలని, కొత్త ప్రభుత్వంపై యువత ఆశలకు భంగం కలిగించవద్దని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్ర, సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ సూచించారు. రూ.3వేల నిరుద్యోగ భృతి, 20 లక్షల ఉద్యోగాల కల్పనకు ఇచ్చిన హామీలను తప్పక అమలు చేయాలని కోరారు. జులై 27, 28 తేదీల్లో విజయవాడలో నిర్వహించే అఖిలభారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) ఎన్టీఆర్ జిల్లా స్థాయి యువజన విద్యా వైజ్ఞానిక రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమాఖ్య జిల్లా కార్యవర్గ సమావేశం శనివారం జిల్లా అధ్యక్షుడు లంక గోవిందరాజులు అధ్యక్షతన జరిగింది. దోనేపూడి శంకర్, పరుచూరి రాజేంద్రబాబు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేఖ హోదా సాధనకు, పోలవరం ప్రాజెక్టు పూర్తికి కేంద్రప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని చంద్రబాబును కోరారు. విద్యార్థి, యువజన, ప్రజా సంఘాలు, వామపక్ష నాయకులపై గత వైసీపీ ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులు కొట్టివేయాలని కోరారు. అధికారంలోకి వస్తే మెగా డీఎస్సీ ప్రకటిస్తూ మొదటి సంతకం చేస్తానన్న మాటకు చంద్రబాబు కట్టుబడాలన్నారు. జులైలో జరగబోయే శిక్షణా తరగతుల్లో యువతకు రాజకీయ, సైద్ధాంతిక అంశాలతో పాటు అనేక విషయాలపై అవగాహన కల్పించి వారిని భవిష్యత్ నేతలుగా తీర్చిదిద్దేందుకు ప్రయత్నం జరుగుతుందని, ఈ శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. సమావేశంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ సుభాని, సహాయ కార్యదర్శి పేయ్యల పృథ్వీరాజ్, కార్యనిర్వాహక కార్యదర్శి లంకే సాయి, జిల్లా ఆఫీస్ బేరర్లు నాగబాబు, భాను, వెంకటేశ్, హరీశ్, సింగంశెట్టి మోహన్‌ప్రసాద్, కార్తీక్, గాడి అజయ్ పాల్గొన్నారు.

సంపాదకీయం

మోదీని నిలవరించే ప్రతిపక్ష నేత రాహుల్

కాంగ్రెస్ కనీసం ప్రతిపక్ష హోదా సంపాదించే స్థాయికి కూడా ఎదగలేదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇటీవల కూడా దెప్పి పొడిచారు. 2014లో మోదీ అధికారంలోకి వచ్చినప్పుడు విపరీతంగా కుదేలైన కాంగ్రెస్‌కు కేవలం 44 సీట్లే దక్కాయి. 2019లో 52 స్థానాలకు కాంగ్రెస్ పరిమితమైంది. లోకసభ మొత్తం స్థానాలు 543 కనక అందులో పదిశాతం సీట్లువస్తే తప్ప అధికారికంగా ప్రతిపక్ష పార్టీహోదా ఆ పార్టీకి దక్కదన్నందువల్ల మొన్నటిదాకా కాంగ్రెస్ నాయకుడు అధీర్ రంజన్ సర్కార్ కాంగ్రెస్ పక్ష నాయకుడిగా వ్యవహరించారు. దాదాపు పదేళ్ల తరవాత ఇటీవలి ఎన్నికల్లో కాంగ్రెస్ బలం 100కు పెరిగినందువల్ల రాహుల్ గాంధీని ప్రతిపక్ష నాయకుడిగా కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ శనివారం నియమించింది. మహారాష్ట్ర నుంచి ఇండిపెండెంట్ అభ్యర్థిగా ఎన్నికైన విశాల్ పాటిల్ కాంగ్రెస్ కు మద్దతు ప్రకటించినందువల్ల కాంగ్రెస్ బలం 100కు పెరిగింది. గత బుధవారం వెల్లడైన తాజా ఎన్నికల ఫలితాలనుబట్టి ప్రతిపక్షాలకు ప్రస్తుతం 232 స్థానాలున్నాయి. అంటే గతంలో కన్నా ప్రతిపక్షాల బలం రెట్టింపు అయింది. మోదీ ఒక నిర్నిరోధకశక్తి అని గత పదేళ్లుగా ఉన్న అభిప్రాయానికి ఇప్పుడు తెరపడింది. ప్రతిపక్షాలు బాగా పుంజుకున్నందువల్ల మోదీ నాయకత్వంలోని బీజేపీ 240 సీట్లకు పరిమితం కావాల్సి వచ్చింది. మోదీని ఓడించడం అసాధ్యం అన్న అభిప్రాయాన్ని తాజా ఎన్నికలు పటాపంచలు చేశాయి. పార్లమెంటరీ వ్యవస్థల మీద మోదీ ఉడుంపట్టు సడలించడం కష్టమన్న భావనను ఈ ఎన్నికలు పటాపంచలు చేశాయి. మోదీ హయాంలో బీజేపీ అపూర్వమైన మెజారిటీ సాధించినందువల్ల మొన్నటి దాకా ప్రతిపక్షాలు చతికిల పడ్డట్టు భావించారు. కాని ఆ భావన ఇప్పుడు తిరగబడింది. ఇందిరా గాంధీ కుటుంబం కాంగ్రెస్ మీద పెత్తనం చేస్తోందని, రాహుల్ గాంధీ తండ్రి రాజీవ్ గాంధీ, నాయనమ్మ ఇందిరా గాంధీ, ముత్తాత పండిత్ జవహర లాల్ నెహ్రూ సుదీర్ఘ కాలం అధికారానికి అంటిపెట్టుకుని వంశపారంపర్య రాజకీయాలు కొనసాగిస్తారని మోదీ విమర్శలు గుప్పించేవారు. 2019లో కాంగ్రెస్ పరాజయానికి బాధ్యత వహిస్తూ రాహుల్ గాంధీ కాంగ్రెస్ అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. ఆయన చాలా కాలంగా లోకసభ సభ్యుడిగా ఉన్నప్పటికీ మన్ మోహన్ సింగ్ పదేళ్ల ప్రధానమంత్రిగా ఉన్న సమయంలోనూ మంత్రి పదవి స్వీకరించడానికి రాహుల్ గాంధీ నిరాకరిస్తూనే వచ్చారు. కానీ 2014లో మోదీ అధికారంలోకి వచ్చిన తరవాత, ప్రధానంగా 2019 ఎన్నికల తరవాత ప్రతిపక్ష నాయకుడిగా అధికార హోదా లేకపోయినప్పటికీ ప్రతిపక్ష నేత అంటే రాహుల్ గాంధీనే అన్న బలమైన ముద్ర వేశారు. నిరంతరం మోదీ ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తూ ప్రజల మన్నన పొందారు. ముఖ్యంగా రాఫేల్ యుద్ధ విమానాల కొనుగోలులో జరిగిన కుంభకోణాన్ని ప్రస్తావించడంతో రాహుల్ గాంధీ తానే అసలైన ప్రతిపక్ష నాయకుడిననిపించుకున్నారు. చౌకీదార్ చోర్ హై అన్న ఆయన పదే పదే ఆక్షేపించడం జనం దృష్టిని బాగా ఆకర్షించింది. కాంగ్రెస్ అధ్యక్ష స్థానంలో సోనియా గాంధీ ఉన్నా, ప్రస్తుతం మల్లికార్జున్ ఖర్గే ఉన్నా అసలు ప్రతిపక్ష నేతగా కనిపించింది రాహుల్ గాంధీనే. ఆయన కాంగ్రెస్ లో పదవిని తృణప్రాయంగా భావించారు. మోదీ అకృత్యాలను అదేపనిగా బయట పెట్టుండడంతో బీజేపీ గడగడలాడి పోయింది. ఆయనను పార్లమెంటులో లేకుండా చేయడానికి కుట్ర పన్ని ఆయన లోకసభ సభ్యత్వమే రద్దు అయ్యేట్టు చేశారు. పార్లమెంటు సభ్యుడిగా ఆయనకు కేటాయించిన ఇంటిని కూడా ఖాళీ చేయించారు. రాహుల్ గాంధీ ఉట్టి పప్పు సుద్ద అని ప్రచారం చేశారు. అయినా రాహుల్ పోరాటం ఎన్నడూ ఆపలేదు. చివరకు అత్యున్నత న్యాయస్థానం ఆదేశంతో రాహుల్‌గాంధీ లోకసభ సభ్యత్వాన్ని పునరుద్ధరించక తప్పలేదు. ఇటీవలి ఎన్నికల్లో కేరళలోని వాయనాడ్, ఉత్తరప్రదేశ్‌లోని రాయబరేలీ నుంచి విజయం సాధించి రాహుల్ రికార్డు సృష్టించారు. దేశంలోని మైనారిటీలను, ముఖ్యంగా ముస్లింలను వేధిస్తున్న మోదీ నాయకత్వాన్ని ఎండగట్టడంలో రాహుల్ గాంధీ అద్వితీయమైన పాత్ర పోషించారు. మోదీ హయాంలో రాజ్యాంగ వ్యవస్థలు ధ్వంసం అవుతున్న తీరును నిరంతరం ప్రజలకు తెలియజెప్పారు. సామాన్య జనం కూడా ఇటీవల రాజ్యాంగ పరిరక్షణ ఆవశ్యకతను గుర్తించడానికి ప్రతిపక్షాలు చేసిన కృషి ఎంత ఉందో రాహుల్ గాంధీ ప్రయత్నం అంతే ఉంది. ఒక వేపున మోదీ హయాంలోని కుంభకోణాలను బయటపెట్టడం, మరోవేపు బీజేపీ అనుసరిస్తున్న విద్వేష పూరిత రాజకీయాలను బట్టబయలు చేయడంలో రాహుల్ గాంధీ పాత్ర విస్మరించడానికి వీలు లేనిది. ప్రతిపక్షంలో దిగంతాల లాంటి వారు ఉన్నప్పటికీ అసలు పోరాటం రాహుల్ గాంధీనే కొనసాగించారు.

ఇటీవలి ఎన్నికల ప్రచారంలో నిరుద్యోగ సమస్య, పేదరికం, పెరుగుతున్న అసమానతలు, సామాజిక న్యాయం ఆవశ్యకత గురించి రాహుల్ దీక్షా బద్ధంగా చేసిన ప్రచారం ప్రతిపక్షాలను ఏకంచేయడానికి దోహదం చేసింది. ప్రతిపక్షాలు లేవనెత్తిన అంశాలే ఎన్నికలలో ప్రధానాంశాలయ్యాయి. దేశంలో దక్షిణ కొసనుంచి ఉత్తరప్రాంతం చివరిదాకా దాదాపు 4,500 కి.మీ. రాహుల్ గాంధీ నిర్వహించిన భారత్ జోడో యాత్ర, ఆ తరవాత తూర్పు నుంచి పశ్చిమ కొస దాకా నిర్వహించిన యాత్ర ప్రజలను జాగృతం చేయడానికి తోడ్పడ్డాయి. ఈ రెండు యాత్రలతో రాహుల్ పట్టుదల ఏమిటో రుజువైంది. కాంగ్రెస్ పునరుజ్జీవానికి దోహదకారి అయ్యాయి. బీజేపీకి కంచుకోట అనుకునే ఉత్తరప్రదేశ్‌లో ఆ పార్టీ 33 సీట్లకు తగ్గడానికి అఖిలేశ్ యాదవ్ నాయకత్వంలోని సమాజ్‌వాదీ పార్టీతో కలిసి రాహుల్ చేసిన కృషి "ఇండియా" ఐక్య సంఘటనకు అద్భుతమైన ఫలితాలిచ్చింది. లోకసభలో పది శాతం సీట్లు లేని పార్టీకి అధికార హోదా ఉండదని ఏ చట్టంలోనూ లేదు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి బలమైన ప్రతిపక్షం ఎంత అవసరమో, ప్రతిపక్ష పార్టీ నాయకుడి పాత్రా అంతే ప్రధానమైంది. మనం అనుసరిస్తున్నది బ్రిటిష్ తరహా పార్లమెంటరీ ప్రజాస్వామ్యం. బ్రిటన్‌లో ప్రతిపక్ష పార్టీ నాయకుడిని భావి ప్రధాని అంటారు. ప్రతిపక్ష నాయకుడంటే కేవలం ప్రభుత్వ తప్పులెన్నడమే కాదు అవసరమైనప్పుడు అవకాశం వస్తే ప్రభుత్వం ఏర్పాటు చేయగల సత్తా ఉన్నవాడు అన్న ఆనవాయితీ ఉంది. మన పార్లమెంటులో అధికారికంగా ప్రతిపక్ష నాయకుడైన వ్యక్తిది చట్టబద్ధమైన హోదా. కాబినెట్ మంత్రికి ఉండే సదుపాయాలన్నీ ఉంటాయి. కాంగ్రెస్ (ఓ) నాయకుడు రాం సుభాగ్ సింగ్, వై.బి.చవాన్, జగ్జీవన్ రాం, రాజీవ్ గాంధీ, శరద్ పవార్, సోనియా గాంధీ లాంటి వారు ప్రతిపక్ష నాయకులుగా వ్యవహరించారు. వై.బి.చవాన్ అయితే రెండుసార్లు ప్రతిపక్ష నేతగా ఉన్నారు. మన పార్లమెంటరీ సంప్రదాయాల్లో ఉన్న సొగసు ఏమిటంటే ప్రతిపక్ష నాయకుల్లో యోధానుయోధులు, అద్భుతమైన వక్తలు ఉన్నారు. వారు నెలకొల్పిన సంప్రదాయాన్ని కొనసాగించే సత్తా రాహుల్ గాంధీ సంపాదించుకోవాలి.

గ్రామాల్లో బీజేపీకి భారీ నష్టం

గ్రామీణ భారతదేశం, ప్రత్యేకించి ఉత్తరాదిలో పాలకపక్షం పార్లమెంటులో మెజారిటీని కోల్పోయింది, తద్వారా ప్రభుత్వ ఏర్పాటుకు సాధారణ మెజారిటీని కూడగట్టుకోవడానికి మిత్రులపై ఆధారపడవలసి వచ్చింది. భారతీయ జనతా పార్టీ ప్రస్తుత 2024 ఎన్నికల్లో గ్రామీణ పార్లమెంటరీ నియోజకవర్గాలలో మూడవ వంతును కోల్పోయింది. 2019 లోకసభకు జరిగిన ఎన్నికల్లో 251 గ్రామీణ స్థానాల్లో గెలవగా, ఈసారి 126 స్థానాలను మాత్రమే బీజేపీ పరిమితమైంది. అయితే, ఇండియా కూటమి 157 గ్రామీణ చిన్నపట్టణాల నియోజకవర్గాలను గెలుచుకుంది. గ్రామీణ ప్రజల అసంతృప్తి, పంటలకు ధరలు లేపోవడం, నిరుద్యోగం, బీజేపీ తక్కువ స్థానాలు గెలవడానికి ప్రధాన కారణాలు. ముఖ్యంగా ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ సీట్లు కోల్పోవడానికి పైన పేర్కొన్న కారణాలను నిపుణులు పేర్కొంటున్నారు. గ్రామీణ అసంతృప్తికి లాభదాయకమైన వ్యవసాయ ధరల కొరత, అధిక నిరుద్యోగం, వ్యవసాయ కూలీ వేతన స్తబ్దత, పెరిగిన ధరలు కారణంగా ఇటీవలి ఎన్నికల్లో అధికార పార్టీ ఓడిపోయింది.

నల్ల వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా సంవత్సరంపైగా రైతుల మిలిటెంట్ ఆందోళన, ప్రభుత్వ అణచివేత, కేంద్రమంత్రి మిశ్రా కుమారుడు కారు రైతులపైకి దూకించి హత్యగావించడం లాంటి అత్యాచారాలు ఓటమికి కారణం. గత దశాబ్దంన్నర కాలంలో, భారతదేశంలో గ్రామీణ సంక్షోభం పెరిగింది. ఎరువులు, విత్తనాలు, డీజిల్, పురుగుమందుల అధిక ధరలతో సాగు ఉత్పత్తి వ్యయం దాదాపు మూడు రెట్లు పెరిగింది. ప్రభుత్వం కాలానుగుణంగా ఎమ్మెస్పీలను ప్రకటిస్తున్నప్పటికీ, పండించిన ఉత్పత్తులను మార్కెట్‌లో ధరలు రైతులకు ఉపశమనం కలిగించడం లేదు. ఆర్థికపరంగా రెండు రకాల ఆదాయాలు ఉన్నాయి- నామమాత్ర, వాస్తవ ఆదాయాలు. నామమాత్రపు ఆదాయాలు (కరెన్సీ పరంగా) ఎంఎస్పీలలో స్వల్ప పెరుగుదలతో ఉన్నప్పటికీ వాస్తవ ఆదాయాలు పడిపోతున్నాయి. వాస్తవ ఆదాయం మనం వినియోగించే ఆహారం, గృహ పారిశ్రామిక వస్తువుల కొనుగోలు శక్తి (వినియోగదారు ధర సూచిక) తో ముడిపడి ఉంటుంది. ఆర్థికవేత్తల అంచనాల ప్రకారం, గత 15 సంవత్సరాలలో వాస్తవ ఆదాయం 60శాతం తగ్గింది. ప్రధానంగా మార్కెట్లలో వ్యవసాయ, పారిశ్రామిక వస్తువుల మధ్య అసమానత, ధరలు అసమతుల్యత వల్ల దేశంలోని మొత్తం వ్యవసాయో త్పత్తుల విలువ రూ.42 లక్షల కోట్లలో దాదాపు రూ.28 లక్షల కోట్లు నగరాలకు బదిలీ అయ్యాయి. అంటే సూపర్ మార్కెట్లలో వినియోగ దారుడు వ్యవసాయ వస్తువులను కొనుగోలుచేస్తే, ప్రతి రూపాయికి రైతు కేవలం 26 నుండి 30 పైసలు మాత్రమే పొందుతున్నాడు. ఈ మిగులు ధాన్యం వ్యాపారులు, మిల్లర్లు ప్రధానంగా మెట్రోపాలిటన్ కార్పొరేట్ సంస్థలు జేబులో వేసుకుంటున్నారు. అందువల్ల లాభించే ఆదాయం కుటుంబాలను పోషించలేకపోతోంది. ఈనామ్ మార్కెట్లు, ఆదాయాన్ని రెట్టింపు చేసే పథకాలు రైతుల ఆదాయాన్ని పెంచేందుకు ఏమాత్రం సహకరించలేదు. విధాన రూపకర్తల నుండి గ్రామీణ దుస్థితిపై తగిన శ్రద్ధ లేదు. గ్రామీణ కుటుంబాలకు ఉపాధి, సహాయాన్ని అందించడానికి బదులుగా, కేంద్ర ప్రభుత్వం వివిధ సబ్సిడీలు, మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి పథకానికి బడ్జెట్ కేటాయిం పులను తగ్గించింది. సబ్సిడీ కేటాయింపులు గత 2-3 సంవత్సరాలుగా తగ్గుతున్నాయి. గ్రామీణాభి వృద్ధి మంత్రిత్వ శాఖ డేటా ప్రకారం, గ్రామీణ ఉపాధిపథకం కింద పనికోసం డిమాండ్ ఏప్రిల్‌లో 48.8 శాతం పెరిగింది, 30.2 మిలియన్ల మంది ప్రజలు పనులు కోరుతున్నారు(నేషనల్ కౌన్సిల్ ఆఫ్ అప్లైడ్ ఎకనామిక్ రీసెర్చ్, ఎన్‌సిఎఇఆర్ మే, 2024). పన్ను సేకరణలు, ముఖ్యంగా జీఎస్‌టీ అత్యంత పటిష్టంగా ఉన్నప్పుడు, ప్రభుత్వం సబ్సిడీలు గ్రామీణ ఉపాధి పథకం కోసం ఖర్చు చేయలేదు. తగ్గుతున్న గ్రామీణ వినియోగం భారతదేశం తాత్కాలిక జీడీపీ 2024 లో పరిశ్రమ, సేవలు, మైనింగ్ రంగాల కారణంగా 8.2% వృద్ధి చెందగా వ్యవసాయంలో జీడీపీ, స్థూల విలువ జోడింపు 2024లో 1.4 శాతానికి తగ్గింది. సగటు వ్యవసాయ వృద్ధి సాధారణంగా 3 శాతంగా ఉంటుంది. 2023-24లో ఇది 1.4 శాతం మాత్రమే ఉంది. ఫిబ్రవరి-ఏప్రిల్‌లో సగటు ఆహార ద్రవ్యోల్బణం 8.6 శాతంగా ఉంది. వినియోగంలో క్షీణత, గ్రామీణ డిమాండ్ తగ్గుదల గృహోపకరణాలు మాత్రమే కాకుండా గ్రామీణ మార్కెట్లలో ట్రాక్టర్లు, మోటార్ సైకిళ్ల అమ్మకాలు తగ్గాయి. సైన్యంలో కాంట్రాక్టు ఉద్యోగం అగ్నివీర్‌ని ప్రవేశపెట్టారు. ఉత్తర భారతదేశంలో గణనీయమైన సంఖ్యలో రైతు కుటుంబాలు వారి పిల్లల ఆర్మీ ఉద్యోగాలపై ఆధారపడి జీవిస్తున్నారు. ఉపశమనం అందించడానికి ప్రభుత్వం గ్రామీణ ఉద్యోగాలు, రాయితీల కోసం అదనపు నిధులను కేటాయించవలసి ఉంటుంది, ఆహార నిల్వ గోడౌన్లు, పాఠశాలలు, ఆసుపత్రులు, నీటిపారుదల కాలువల మరమ్మతులు, వ్యవసాయ రంగంలో ప్రభుత్వ పెట్టుబడులను పెంచాలి. అన్నింటికీ మించి, డాక్టర్ స్వామినాథన్ సిఫార్సుల మేరకు ప్రభుత్వం పంట ఎమ్ఎస్‌పీలను పెంచాలి. రైతులు కోరిన విధంగా చట్టపరమైన పంట కొనుగోలుకు హామీ ఇవ్వాలి.

సోమ మర్ల

మోదీకి భవిష్యత్ నల్లేరు మీద నడక కాదు

అది విచిత్రమైన రోజు. ఒక వైపు ప్రజలు విజయానికి దుఃఖిస్తున్నారు, మరోవైపు ప్రజలు ఓటమిని సంబరాలు చేసుకుంటున్నారు. కానీ ప్రమాదకర విషయం తెలియకపోతే మాత్రం ఇదొక విచిత్రం. ఇండియా కూటమికి ఓటువేసిన ప్రతి ఒక్కరూ రాహుల్ గాంధీ అభిమానులే కాదు. కూటమి నుంచి ఎదిగే ఉత్తమ ప్రధానిగా చాలామంది ఆయనను పరిగణించకపోవచ్చు. కానీ మొన్నటి ఎన్నికల ఫలితాలు ఇప్పటికీ సంబరాలకు కారణం ఎందుకంటే, ఇది మోది పురాణాన్ని ఛేదించడమే.

మోదీ పురాణం అతి జాగ్రత్తగా రూపొందించిన కథ. 2002 అల్లర్లలో ఒకప్పుడు సొంత పార్టీ ఛీత్కరించిన వ్యక్తి 2014 లోక్‌సభ ఎన్నికల్లో 'అభివృద్ధి'కి దీటుగా నిలిచాడు. ప్రత్యేక మూలాలున్న పౌరాణిక కథానాయకుల మాదిరిగానే, మోదీ ఆయన ప్రచార యంత్రాంగం ఆయనను స్వయం ప్రకాశక శక్తిగా సృష్టించడానికి తగినంత సమాచారం సిద్ధం చేసింది. ఆయనొక వినయ పూర్వకమైన చాయ్ వాలా. మొసలితో కుస్తీ పట్టాడు. ఎప్పుడూ నిద్రపోలేదు. దేశం గురించి ప్రతిరోజూ 24 గంటలు ఆలోచించాడు. ఆయన ఒక సన్యాసి. ఏ దురలవాట్లూ లేవు. తనను తాను మూడవ వ్యక్తిగా భావించాడు. ఆయనలోని స్పష్టమైన లోపాలు గౌరవ చిహ్నాలుగా మారాయి. హార్డ్ వర్క్ హార్వర్డ్ కంటే మెరుగైనది అనే భ్రమ కలిగించారు. ఆయన హయాంలో గుజరాత్‌లో జరిగిన అల్లర్లలో దుండగులు ఓ యువ మహిళా ఆర్కిటెక్ట్‌ను వెంబడించి, ఆమె కుటుంబాన్ని వేధించడం లాంటివన్నీ మరుగున పడ్డాయి. మెరుగైన సామాజిక సూచీలున్న రాష్ట్రాల ప్రజలు సైతం 'గుజరాత్ మోడల్' ఉచ్చులో పడిపోయారు. ఇటీవల ప్రశాంత్ కిషోర్ కరణ్ థాపర్‌తో జరిగిన ఇంటర్వ్యూలో అంగీకరించినట్లు, 2014 ఎన్నికల సమయంలో మోదీ మతపరమైన వాక్చాతుర్యం నుండి దూరంగా జరిగి, దేశాన్ని అపరిమితంగా అభివృద్ధిచేసే గొప్ప నాయకుడిగా తనను తాను ప్రదర్శించుకున్నారు. అయితే ఆయన రాజకీయ జీవితాన్ని నిశితంగా గమనించిన వారికి ఏమి జరుగుతుందో నిజంగా తెలుసు. గుజరాత్ సంఘ్ పరివార్ ప్రభావంతో హిందూ రాష్ట్రంగా స్థిరపడింది.

మోదీ చుట్టూ ఉన్న వ్యక్తి ఆరాధనతో బీజేపీ ప్రతి ఎన్నికల్లో ఆయన పేరుతోనే పోరాడింది. మోదీ నిత్యం ఎటువంటి గగ్గోలు, మొండి ప్రకటనలు చేసినా, రాహుల్ గాంధీని 'పప్పు' అని పిలిచి ఎగతాళి చేశారు. భారత ప్రజాస్వామ్యాన్ని ఇద్దరు రాజకీయ నాయకుల మధ్య రాష్ట్రపతి ఎన్నికలను ముఖాముఖీగా మార్చడం ద్వారా, తమకు మోదీ తప్ప వేరే మార్గం లేదని ఓటర్లను నమ్మించేలా బీజేపీ చేసింది. ఆయన కాకపోతే, ఎవరు? 1.4 బిలియన్ల దేశ ప్రజలకు నాయకత్వం వహించడానికి మరొకరిని అంగీకరించక, బీజేపీ మద్దతుదారులు అవినీతి, బంధుప్రీతి, ప్రభుత్వ సంస్థల దుర్వినియోగాన్ని విస్మరించి, ఆర్ఎస్ఎస్ సహాయం లేకుండా వేల సంవత్సరాల మనుగడగల హిందూ మతానికి మోది ఒక్కరే రక్షకుడు అనే వేళ్ళు సమాజంలో లోతుగా పాత గలిగారు. ఈ ఎన్నికల సమయంలో మోదీ స్వయంగా హిందూ దేవుడయ్యారు. జగన్నాథుడు మోదీ భక్తుడని ఆ పార్టీ సభ్యుడు ఒకరు పేర్కొని ముఖం పగిలే ఎదురుదెబ్బ తగలడంతో ఆ ప్రకటనను ఉపసంహరించుకున్నాడు. కానీ మోదీ తనశక్తి జీవసంబంధమైనది కాదని తన విధిని నెరవేర్చడానికి దేవుడే తన రూపంలో ప్రతినిధిగ పంపినట్లు ఆయన గర్వంగా ప్రకటించుకున్నాడు. ఈ వాక్యం విన్న వెంటనే పంచతంత్రంలోని నీలిరంగు నక్క కథ అందరికీ గుర్తుకొచ్చింది. తాను రంగులు పులుముకుని తనను తాను దేవుడిగా ప్రకటించుకున్నాడు.

మోదీని ప్రశ్నించిన వారు దేశ వ్యతిరేకులు, ప్రభుత్వ ద్రోహులు. దశాబ్దాల వలసపాలన తర్వాత ఈ దేశాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధిపరచిన ఎందరో దార్శనికులను బలహీనులుగా కొట్టిపారేశారు. వారు నెలకొల్పిన సంస్థల విజయాలకు మోదీ క్రెడిట్ తీసుకున్నారు. ఉదాహరణకు ఇస్రో. ఎన్నికలలో బీజేపీపికి వ్యతిరేకంగా ఓటు వేసినందుకు అయోధ్య ప్రజలను ఆయన మద్దతుదారులు జాతీయ వ్యతిరేకులు, హిందూ వ్యతిరేకులుగా ముద్ర వేశారు. వీటన్నింటినీ పర్యవేక్షిస్తున్న రామ్ లల్లా సంగతేంటి? ఇప్పుడు ఆయన కూడా దేశ వ్యతిరేకినా.. అందుకే నిన్న మోదీ జై జగన్నాథ్ అంటూ వెళ్లారా?

గణితశాస్త్రం మోదీకి తెలిసిన అంశం కాదు (అదనంగా 2ఎబి ఎక్కడ నుండి వస్తుందో ఆ మనిషికి ఇప్పటికీ తెలియదు) కానీ బీజేపీ సూత్రం చాలా సులభం. "హిందువుల ఓట్లను సంఘటితంచేసి మిగిలిన వారిని వేరు చేయండి, కేరళ వంటి రాష్ట్రాల్లో హిందూ ఏకీకరణ ఒక్కటే సరిపోదు, క్రైస్తవులను ముసుగులోకి ఆహ్వానించారు. ప్రతిదానికి మతం రంగు పూశారు.. నెట్‌ఫ్లిక్స్ షోల నుండి బందీలు లేని మోడల్స్ ఉన్న ప్రకటనల వరకు. మహమ్మారి వంటి గ్లోబల్ సంక్షోభం కూడా, బీజేపీ మతం గురించి చెప్పడానికి మార్గాలను సుగమం చేసింది. మోదీ అనే అల ప్రభావం ఫెడరలిజానికి ముప్పుగా పరిణమించింది. ప్రాంతీయ పార్టీలను, అసమ్మతిని అణిచివేయాలని ప్రయత్నించింది. వంగమని అడిగితే నేలను పాకే మాధ్యమాలనన్నింటినీ కొన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలను డబ్బు, కండబలం ద్వారా విచ్ఛిన్నం చేసింది. విస్తారమైన, వైవిధ్యభరితమైన దేశాన్ని 'ఒకటి'గా కుదించాలన్న ప్రక్రియలో నిమగ్నమై, మోదీ-షా యంత్రాంగం ఒకే దేశం, ఒకే ఎన్నికలు, ఒకే భాష, ఒకే మతం మొదలైన వాటిని తెర మీదకు తెచ్చింది. రంగు పులుముకున్న నీలి నక్కను సామాన్యులు గుర్తించారని ఫలితాలు రుజువు చేసాయి. అయోధ్యలో రామమందిరం బీజేపీకి ప్రతిష్ఠాత్మకమైన కల. 90వ దశకంలో పెరిగిన మనలో డిసెంబర్ 6, దాని వలన ఉత్పన్నమయ్యే హింస గురించి హెచ్చరికలు గుర్తుంటాయి. ఆలయం పూర్తిగా పూర్తి కాకముందే, లోక్‌సభ ఎన్నికల సమయంలో విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. బీజేపీలోకి సెలబ్రిటీలు ఎగబడ్డారు. మోదీ భూమి మీద రాజులా నడిచారు. దేశ వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉత్కంఠ నెలకొంది. కానీ మోదీకి వ్యతిరేకంగా అయోధ్య ఓటేసింది. తాము ఎదుర్కొన్న కష్టాలు మాట్లాడిన స్థానికుల వీడియోలతో ట్విట్టర్ నిండింది. మహా దేవాలయం విశ్వాసానికి చిహ్నాలా లేక మోదీ అభిరుచికి చిహ్నాలా? మోదీ గారూ.. మీరు చూస్తారు, మీరు పేదరికం నిర్వచనాన్ని మార్చవచ్చు, దానిని నిర్మూలించారని గొప్పగా ప్రకటించుకోవచ్చు కానీ పేదరికం మీరు నిర్మూలించలేరు. మీరు తదుపరి ప్రధాని కావచ్చు. కరెన్సీని ఇష్టానుసారంగా రద్దు చేయడం, 1.4 బిలియన్ల జనాభా ఉన్న దేశాన్ని ఎలాంటి నోటీసు లేకుండా లాక్‌డౌన్‌లో ఉంచడం... ఇదే కాదు. దేశ పౌరులను 'చొరబాటుదారులు' అని పిలవలేని మోదీగా రోజులుంటాయి. ఎటువంటి వ్యతిరేకతను ఆశించదు. ఇక వినయపూర్వకమైన మోదీ అవుతారు. రాజకీయ శాస్త్రంలో, ఈ అధ్యాయాన్ని పీపుల్ పవర్ అంటారని మోదీ వినవలసి వచ్చే రోజులే భవిష్యత్‌లో....

-సౌమ్య రాజేంద్రన్

(అనువాదం: నందిరాజు రాధాకృష్ణ

సెల్: 848128215

దేవనూరు మహదేవ దేశంలో ఒక సంచలనం!

డాక్టర్ దేవరాజు మహారాజు

'కన్నడ దళిత బందయ' ఉద్యమానికి ఊపిరులూదిన ప్రఖ్యాత కన్నడ రచయిత దేవనూరు మహదేవ, ఇప్పుడు కర్నాటక రాష్ట్రానికి, కన్నడ భాషకూ పరిమితమైన రచయిత కాదు. ఆయన రచనలకు వెంటవెంటనే వచ్చిన అనువాదాల వల్ల ఆయన ఇప్పుడు భారతీయ రచయితల జాబితాలో చేరిపోయారు. పద్మశ్రీ, కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు స్వీకరించడం వల్ల కూడా ఆయన గురించి ఇతర రాష్ట్రాలలో తెలిసింది. అంతకంటే ముఖ్యంగా 2010 లో కర్నాటక రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 'నృపతుంగ అవార్డు' ను తిరస్కరించడం వల్ల కూడా ఈ రచయిత పేరు భారతీయ జగత్తులో మారుమోగింది. 'ఒడలాల' 'కుసుమ బాలె' 'ఇడగ బిడ్డ అక్షర' వంటివి ఈయన ప్రసిద్ధ రచనలు. మైసూరు జిల్లా, నంజన్ గుడ్ తాలూకా దేవనూరు గ్రామంలో 10 జూన్ 1948 న జన్మించిన దేవనూరు మహదేవ, వృత్తిరీత్యా కన్నడ ఉపాధ్యాయుడు. సాదాసీదా జీవితం గడుపుతున్న దశలో నృపతుంగ అవార్డు ద్వారా లభించిన ఐదులక్షల ఒక వెయ్యి నగదును వదులుకోవడం గొప్ప విషయమే! అందుకు ఆయన చెప్పిన బలమైన కారణం ఏమిటంటే- కర్నాటకలో కన్నడం అధికార భాష అయినా, అక్కడి పాఠశాలల్లో ఆ మాధ్యమంలో బోధన జరగకపోవడం! దాన్ని ఆయన తీవ్రంగా నిరసించారు. అందుకే రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే ఆ అవార్డును తిరస్కరించారు. పిల్లలకు మాతృ భాషలో బోధించడం అత్యవసరమని- వెంటనే రాష్ట్ర ప్రభుత్వం కళాశాల స్థాయి వరకు కన్నడ మాధ్యమంలో బోధన చేపట్టాలనీ కోరారు.

కొన్ని విలువలకు కట్టుబడి సాహిత్యోద్యమకారుడిగా ఎప్పుడూ ముందుండే దేవనూరు మహదేవ ఇటీవలి కాలంలో కూడా మరిన్ని సంచలనాలకు కారణమయ్యారు. "ఆర్ ఎస్ ఎస్- దాని మూలం, దాని శ్వాస (ఆర్ఎస్ఎస్ ఆలమట్టు అగల) శీర్షికతో 64 పేజీల ఒక చిన్న పుస్తకం ప్రకటించారు. అది దేశంలోని అధికార పార్టీ బీజేపీకి మూల గురువైన ఆరెస్సెస్ నిజ స్వరూపాన్ని, ఉద్దేశాలను చాలా లోతుగా పరిశీలించి, వాటిని ఈ దేశ ప్రజల ముందుకు తెచ్చింది. మన జానపద కథ, 'బాల నాగమ్మ' కథలో- 'మాయల ఫకీరు ప్రాణం చిలకలోన ఉన్నదీ'- అన్నట్టు... ఇక్కడ పరిపాలన సాగిస్తున్న అధికార పార్టీ ప్రాణం ఆరెస్సెస్ అరచేతిలో ఉందని ఈ దేశ ప్రజలకు తెలుసు. అందుకే ఈ రచయిత నేరుగా ఆరెస్సెస్ విధానాలు, ఆలోచనా ధోరణి ఎలాంటిదో విశ్లేషిస్తూ ఆ పుస్తకం రాశారు. ఆరెస్సెస్ ఈ దేశాన్ని ఎటు ఈడ్చుకు వెళ్లాలని చూస్తూ ఉందో అందులో విడమరిచి చెప్పారు. సంఘ్ పరివార్ గురించి ప్రచారంలో ఉన్న అభిప్రాయాలేమిటీ? వాస్తవానికి దాని అసలు రంగేమిటీ? అనే విషయం స్పష్టంగా ప్రజల ముందుకు తెచ్చారు రచయిత.

ఈ చిన్న కన్నడ పుస్తకం మార్కెట్‌లోకి రాగానే లక్ష కాపీలు అమ్ముడయ్యాయి. ఆ డిమాండ్‌ను తట్టుకునే విధంగా మరో డెబ్బయి వేల కాపీలు ముద్రిస్తున్నారు. అంతేకాదు, తెలుగు, తమిళం, మళయాళం, హిందీ, ఇంగ్లీషు వంటి ఇతర భారతీయ భాషల్లోకి కూడా అనువాదాలు అచ్చవుతున్నాయి. "ఆర్ ఎస్ ఎస్- లోతుపాతులు" శీర్షికతో తెలుగులో కూడా వచ్చింది. అజయ్ వర్మ వల్లూరి అనే యువ రచయిత దీన్ని తెలుగులోకి అనువదించాడు. ఈయన ఇటీవలి కాలంలో మన హైద్రాబాదు సెంట్రల్ యూనివర్సిటీ నుండి ఎం.ఏ డిగ్రీ తీసుకున్నాడు. అసలైతే ఈయన కూడా కర్నాటక వాడే! రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రచురణ సంస్థలన్నీ తెలుగు అనువాదాన్ని ప్రజలకు అందుబాటులోకి తెచ్చాయి. తెలుగు అనువాదం మొదటిసారి సెప్టెంబర్ 2022 లో అచ్చయ్యింది. ప్రతి ఒక్కరూ ఈ పుస్తకం చదివి విషయం వివరంగా తెలుసుకోవాల్సిందే! ఆరెస్సెస్ కున్న నిగూఢమైన ఎజెండా ఏమిటో? అది ఈ దేశాన్ని ఎంత ప్రమాదకర స్థితిలోకి నెట్టివేస్తోందో ప్రతి భారతీయుడు తప్పనిసరిగా తెలుసుకోవాలి. ఎక్కడికక్కడ తిప్పి కొట్టడానికి సిద్ధపడాలి. రచయిత దేవనూరు మహదేవ తన పుస్తకంలో చెప్పిన అంశాలు టూకీగా చెప్పుకోవాలంటే... అవి ఇలా ఉంటాయి-

1. భారత రాజ్యాంగం స్థానంలో మనుస్మృతిని నెలకొల్పాలని ఆరెస్సెస్ ఆరాటపడుతూ ఉంది.

2. కుల మతాల ప్రసక్తి పక్కనపెట్టి మనుషులంతా ఒక్కటే అనే అభిప్రాయం దేశ పౌరుల్లో కలగకుండా చేయాలని ప్రయత్నిస్తోంది. నిచ్చెన మెట్ల కుల సంస్కృతిని పునరుద్ధరించాలని ఆరాటపడుతూ ఉంది.

3. స్త్రీలను దళితుల జాబితాలో చేర్చి, వారి హక్కుల్ని కాలరాయాలని చూస్తోంది.

4. అభివృద్ధి నిరోధకంగా, ఆధునిక ఆలోచనా విధానానికి వ్యతిరేకంగా హిందూ ధర్మాన్ని, భూత వైద్యాన్ని, క్షుద్ర పూజల్ని, వాస్తు, జ్యోతిష్యం, పునర్జన్మల్ని, పాపపుణ్యాల్ని సజావుగా పెంచి పోషించాలని ఆరెస్సెస్, దాని ఉప సంస్థలు, సంఘాలు కలలు కంటున్నాయి. ఆరెస్సెస్ సంతానాలు సుమారు యాభయి దాకా ఉన్నాయి. నలభై సంస్థల వివరాలు ప్రజలకు అందుబాటులో కొచ్చాయి. అందులో బీజేపీ, అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఎబివిపి), హిందూ జాగరణ్ మంచ్, విశ్వ హిందూ పరిషత్, సంస్కార భారతి, భగజరంగ్ దళ్, శ్రీరామసేన, ధర్మసంసద్- ఇలా అనేకం! ఇవన్నీ పాతికేళ్లకు ముందే ఏర్పడ్డ- ఆరెస్సెస్ పిల్ల సంస్థలు. ఇప్పటికి వీటి సంఖ్య ఎన్ని రెట్లు పెరిగాయో లెక్కతేలలేదు.

5. వీటితో ఈ దేశ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రచయిత దేవనూరు మహదేవ హెచ్చరించారు. ఎందుకంటే ఈ సంస్థల సభ్యులందరూ ఆరెస్సెస్ చేతిలో కీలుబొమ్మల్లా ప్రవర్తిస్తారు తప్ప, స్వంత మెదడు ఉపయోగించరు. "తమ సభ్యులకు అసలు వివేచనా శక్తే అక్కరలేదు"- అని గోల్వాల్కర్ 16 మార్చి 1954 న వార్ధాలో చేసిన ప్రసంగంలో అన్నారు.

6. సెక్యులర్, ఫెడరల్ అనే పదాలే వీరికి రుచించవు. వాటిని నాశనం చేయడమే ఆరెస్సెస్ వారి జీవిత ధ్యేయం!

7. ముస్లిం, క్రైస్తవ మైనార్టీలు వారి ఉనికిని వారు కాపాడుకోకుండా అడ్డుపడాలి. వారిని నాశనం చేయాలి. లొంగిపోయి హిందుత్వను స్వీకరించి, బానిసల్లా పడి ఉండడానికి సిద్ధపడితే- సరే. ఉండొచ్చు.

8. జర్మన్ నియంత హిట్లర్ పోకడల్ని తు.చ. తప్పకుండా పాటించాలని, తమ హిందుత్వ ఆధిపత్యాన్ని నిలుపుకోవాలని- ఈ దేశాన్ని హిందూ దేశంగా మార్చాలని వారి కోరిక!

9. మొదట హిందీని దేశమంతా పులిమి, తర్వాత సంస్కృతాన్ని తీసుకురావాలని వారి ఆరాటం! లలితా సహస్ర నామాన్ని పార్లమెంటులో ప్రార్థనా గీతం చేయాలి. వాస్తు, జ్యోతిష్యంతో పాటు భూత వైద్యాన్ని, క్షుద్ర పూజల్ని కూడా విశ్వవిద్యాలయాల్లో కోర్సులుగా చేయాలి. పౌరోహిత్యం, కర్మకాండ కూడా అధ్యయన అంశాలుగా మార్చాలన్నది ఆరెస్సెస్ నిర్ణయం.

10. సావర్కర్‌ను దేశ భక్తుడిగా చేయాలి. విషం కక్కే అతని ఉపన్యాసాల్ని విద్యార్థులకు పాఠ్యాంశాలుగా పెట్టాలి. గాంధీ హత్యకు కారకుడైన గాడ్సేను పరమ దేశ భక్తుడిగా గౌరవించుకోవాలి!

ఓటర్లను డబ్బుతో కట్టిపడేయాలని, ఇతర పార్టీల వారిని డబ్బు- పదవుల ఆశతో లొంగదీసుకోవాలని ఆరెస్సెస్ తీవ్రంగా కృషి చేస్తోంది. దేశంలోని ఎన్నో రాష్ట్రాలలో, సజావుగా నడిచే ప్రభుత్వాల్ని కూలగొట్టి అధికారం చేజిక్కించుకున్న వైనం మనం గత 7,8 ఏళ్లుగా చూస్తూనే ఉన్నాం. దేశంలోని వివిధ రాష్ట్రాలలో 3 రకాల పార్టీలు అధికారంలో ఉన్నాయి. ఒకే వ్యక్తి నియంత్రించే పార్టీలు, ఒకే కుటుంబం నియంత్రించే పార్టీలు, రాజ్యాంగేతర శక్తిగా ఎదిగిన సంఘాలతో ఏర్పడ్డ పార్టీలు. వీటిలో అత్యంత ప్రమాదకరమైంది ఈ మూడో రకం. రాజ్యాంగేతర శక్తిగా ఎదిగిన రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ (ఆరెస్సెస్) చేతిలో కీలుబొమ్మ బీజేపీ. ఆ పార్టీకి గానీ, ఆ నాయకులకు గానీ స్వయం ప్రతిపత్తి ఉండదు. ఆరెస్సెస్ ఆదేశానుసారం బీజేపీ నాయకులు నడుచు కుంటూ ఉంటారు. ప్రజా సంక్షేమం పట్టించుకోరు. అందుకే ప్రజలు తిరగబడి, కర్నాటకలో బీజేపీకి బుద్ధి చెప్పారు. భారతదేశంలో ద్రవిడ, ఆర్య, ఇస్లాం, క్రైస్తవ రక్తాలన్నీ వేరు చేయలేనంతగా కలిసిపోయాయి. అలాంటప్పుడు ఇంకా ఆర్య ఔన్నత్య సిద్ధాంతాన్ని పట్టుకుని రోగ గ్రస్తమైన ఆరెస్సెస్‌కు- తగిన చికిత్స చేయడం తప్పనిసరిఅని రచయిత దేవనూరు మహదేవ చెపుతున్నారు. ఈ దేశంలోనే పుట్టి, దేశ దేశాలకు విస్తరించిన బౌద్ధ, జైన, సిక్కు, లింగాయత జీవన విధానాల్ని బలవంతంగా చాతుర్వర్ణాలలో కలిపి, తమ ఆధిపత్యాన్ని నిలుపుకోవాలని ఆరెస్సెస్ అహర్నిశలు శ్రమిస్తోంది. చారిత్రక కట్టడాల, నగరాల పేర్లు మార్చడం, పాఠ్యాంశాల్లోంచి చరిత్ర, సైన్సు అంశాలిన తొలగించడం ఒక బుద్ధి తక్కువ పని అయితే, ఆదివాసుల, మూలవాసుల పేరు కూడా మార్చి- వారికి 'వనవాసి' అని నామకరణం చేసింది. సింధూ నాగరికత పేరు మార్చి 'సరస్వతి నాగరికత' గా వ్యవహరిస్తోంది. దీని ఆగడాలకు అడ్డుకట్ట వేయాలంటే సామాన్య పౌరులు వివేకవంతులు కావాలి. వైజ్ఞానిక అంగాహనతో నిర్ణయాలు తీసుకోవాలి!



కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు విజేత, జీవశాస్త్రవేత్త.

'నీట్' ఫలితాల సమీక్షకు కమిటీ: ఎన్‌టీఏ

న్యూఢిల్లీ: నీట్-యూజీ వైద్య ప్రవేశపరీక్షలో 1500 మందికిపైగా విద్యార్థులకు గ్రేస్ మార్కులు లభించడాన్ని సమీక్షించేందుకు విద్యాశాఖ ఒక ప్యానల్ ఏర్పాటు చేసింది. నీట్ పరీక్షలో 67 మంది విద్యార్థులకు మొదటి ర్యాంకు రావడం వివాదాస్పదమైంది. ప్రవేశపరీక్షను మళ్లీ నిర్వహించాలన్న డిమాండ్ తెరపైకొచ్చింది. ఈ పరిస్థితుల్లో యూపీఎస్‌సీ మాజీ చైర్మన్ నేతృత్వ నలుగురి సభ్యుల ప్యానల్‌ను విద్యాశాఖ ఏర్పాటు చేసింది. 1500 మందికిపైగా విద్యార్థుల ఫలితాలను సమీక్షించి, ఏమైన సవరణలు అవసరమా లేదా అన్న దానిపై వారంలోగా సిఫార్సులు చేయాలని సూచించింది. ఈ విషయాన్ని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) డైరెక్టర్ జనరల్ సుబోధ్ కుమార్ సింగ్ శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. గ్రేస్ మార్కులు ఇవ్వడం వల్ల ఉత్తీర్ణత క్రైటీరియా ప్రభావితం కాలేదన్నారు. విద్యార్థుల ఫలితాలను సమీక్షించడంతో అడ్మిషన్‌లపై ఎటువంటి ప్రభావం ఉండబోదన్నారు. పరీక్షలు పారదర్శకంగా జరగలేదన్న ఆరోపణలను ఎన్‌టీఏ ఇప్పటికే తోసిపుచ్చింది. అవకతవకలు జరగలేదని స్పష్టం చేసింది. కొన్ని పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు సరిపడ సమయం లభించకపోవడం, ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్యపుస్తకాల్లో మార్పులు వంటి కారణాలతో గ్రేస్ మార్కులు ఇచ్చినట్లు వెల్లడించింది.

ఒడిశా అసెంబ్లీకి తొలిసారి ముస్లిం మహిళ

భువనేశ్వర్: ఒడిశా రాష్ట్ర అసెంబ్లీ చరిత్రలోనే తొలిసారిగా ఓ ముస్లిం మహిళ ఎన్నికయ్యారు. కాంగ్రెస్ పార్టీ తరపున కటక్ అసెంబ్లీ నుంచి సోఫియా ఫిర్దౌస్ గెలుపొందారు. భారతీయ జనతా పార్టీ అభ్యర్థి పూర్ణ చంద్ర మహాపాత్రపై 8,001 ఓట్ల మెజార్టీతోామె విజయం సాధించారు. సోఫియా ఫిర్దౌస్ వయసు 32 ఏళ్లు. ఆమె తండ్రి మహ్మద్ మోఖీం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు. మొన్నటి వరకు కటక్ నుంచి మహ్మద్ మోఖీం ఎమ్మెల్యేగా కొనసాగారు. తండ్రి స్థానంలో కూతురు సోఫియాకు కాంగ్రెస్ పార్టీ టికెట్ కేటాయించింది. ఫిర్దౌస్.. కళింగ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండస్ట్రియల్ టెక్నాలజీ నుంచి సివిల్ ఇంజినీరింగ్‌లో బీటెక్ పూర్తి చేశారు. బెంగళూరులోని ఐఐఎంబీ నుంచి 2022లో ఎగ్జిక్యూటివ్ జనరల్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రాం పూర్తి చేశారు. 2023లో కాన్ఫెడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా భువనేశ్వర్ చాప్టర్‌కు అధ్యక్షురాలిగా ఎంపికయ్యారు. క్రెడాయ్ ఉమెన్స్ వింగ్ ఈస్ట్ జోన్ కోఆర్డినేటర్‌గా ఆమె సేవలందించారు. సీఐఐ- ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ (ఐజీబీసీ) భువనేశ్వర్ చాప్టర్‌కు కో-చైర్మన్‌గా, ఐఎన్‌డబ్ల్యూసీ ఇండియా కోర్ మెంబర్‌గా పని చేశారు. ఆమె పారిశ్రామికవేత్త షేక్ మెరాజ్ ఉల్ హక్‌ను వివాహం చేసుకున్నారు. 1972లో అదే నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించిన ఒడిశా మొదటి మహిళా ముఖ్యమంత్రి నందిని సత్పతి అడుగుజాడల్లో ఆమె నడుస్తున్నారు.

అంతర్జాతీయ నేతలకే ఆహ్వానం
జైరామ్ రమేశ్

న్యూఢిల్లీ: ప్రధానిగా నరేంద్రమోదీ ప్రమాణస్వీకార కార్యక్రమానికి రావాలంటూ కాంగ్రెస్ నేతలకుగానీ, ఇండియా ఐక్య సంఘటన నేతలకుగానీ ఎలాంటి ఆహ్వానాలు అందలేదని కాంగ్రెస్ సీనియర్ నేత, ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ అన్నారు. వాళ్లు కేవలం అంతర్జాతీయ నేతలను మాత్రమే ప్రమాణస్వీకారానికి ఆహ్వానిస్తున్నారని ఎద్దేవా చేశారు. 'వాళ్లు కేవలం అంతర్జాతీయ నాయకులను మాత్రమే ప్రధాని ప్రమాణస్వీకారానికి ఆహ్వానిస్తున్నారు. మా నాయకులకు ఇంతవరకు ఎలాంటి ఆహ్వానాలు అందలేదు. ఒకవేళ ఇండియా ఐక్యసంఘటన నాయకులకు ఆహ్వానాలు అందితే... వెళ్లాలా వద్దా అనేది అప్పుడు నిర్ణయించుకుంటాం' అని జైరామ్ రమేశ్ చెప్పారు.

వయనాడ్‌కు రాహుల్‌గాంధీ గుడ్‌బై !

న్యూఢిల్లీ: కేరళలోని వయనాడ్, యూపీలోని రాయ్‌బరేలీ నుంచి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ లోక్‌సభకు ఎన్నికయ్యారు. అయితే వయనాడ్ సీటును రాహుల్ గాంధీ ఖాళీ చేయనున్నట్లు తెలుస్తోంది. రాయ్‌బరేలీ ఎంపీ హోదాను అలాగే ఉంచుకోవాలని రాహుల్ భావిస్తున్నారు. యూపీలో పార్టీ అభివృద్ధిపై దృష్టి సారించడానికి రాహుల్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు యూపీ కాంగ్రెస్ కమిటీ పేర్కొన్నది. వయనాడ్‌లోనే ఉండాలని తొలుత కేరళ కాంగ్రెస్ కోరినా... యూపీ కాంగ్రెస్ అభ్యర్థన తర్వాత వాళ్లు కూడా వెనక్కి తగ్గారు. శనివారం జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో దీనిపై చర్చ వచ్చినట్లు తెలుస్తోంది. అయితే రెండు నియోజకవర్గాల్లో పర్యటించిన తర్వాత దీనిపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశాలు ఉన్నాయి. వయనాడ్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రియాంకా గాంధీ పోటీ చేయాలన్న అభ్యర్థనను గాంధీ కుటుంబం తిరస్కరించినట్లు తెలుస్తోంది. కేరళకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నేతను వయనాడ్ నుంచి రంగంలోకి దింపాలని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. వయనాడ్ నుంచి 3,64,422 ఓట్ల తేడాతో రాహుల్ గాంధీ గెలిచినా... 2019 నాటి ఫలితాలతో పోలిస్తే సుమారు 67,348 ఓట్ల సంఖ్య తగ్గింది.

రామోజీరావు మృతికి విజయన్ సంతాపం

తిరువనంతపురం: రామోజీ గ్రూపు సంస్థల చైర్మన్ రామోజీరావు మృతికి కేరళ సీఎం పినరయి విజయన్ సంతాపం వ్యక్తం చేశారు. మీడియా, సినీ రంగాల్లో ఆయన సేవలు మరువలేనివన్నారు. కేరళ కష్టాల్లో ఉన్నప్పుడు రామోజీరావు ఆదుకున్నారని అన్నారు. వరదలు అతలాకుతలం చేసినప్పుడు అండగా నిలిచారని చెప్పారు. వరద బాధితుల కోసం రామోజీ ఫౌండేషన్ ఇళ్లు నిర్మించిందని గుర్తుచేశారు. ఉత్సుకత, దూరదృష్టి, సంకల్పంతో ప్రవేశించిన ప్రతి రంగంలో ఆయన చెరగని ముద్ర వేశారని... ఎంతోమందిలో స్ఫూర్తి నింపారని తెలిపారు.

మధ్యవర్తిత్వ న్యాయస్థానాలు వృత్తి నైపుణ్యంతో పనిచేయాలి
బ్రిటన్ సుప్రీంకోర్టులో సీజేఐ జస్టిస్ చంద్రచూడ్

న్యూఢిల్లీ: ప్రత్యామ్నాయ న్యాయ వేదికలుగా అవతరిస్తున్న మధ్యవర్తిత్వ న్యాయస్థానాలను సమర్థమైన వ్యవస్థలుగా మలచుకోవాలని భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ డి.వై.చంద్రచూడ్ సూచించారు. వృత్తి నైపుణ్యంతో అవి పనిచేస్తే మంచి ఫలితాలు వస్తాయని అభిప్రాయపడ్డారు. నేర ముఠాల నియంత్రణలోకి అవి వెళ్లకుండా జాగ్రత్త వహించాలని హెచ్చరించారు. బ్రిటన్ సుప్రీంకోర్టులో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. భారత్‌లో మాదిరిగా వ్యాపార మధ్యవర్తిత్వ న్యాయస్థానాలు అన్ని దేశాల్లోనూ ఆవిర్భవించాలని అభిలషించారు. ముఖ్యంగా అభివృద్ధిచెందుతున్న దేశాల్లో వ్యాపార మధ్యవర్తిత్వ న్యాయస్థానాల సంస్కృతి విస్తరించడంతో పాటు బలమైన వ్యవస్థలుగా రూపొందాల్సిన అవసరం ఉందన్నారు. వ్యాపార వివాదాల పరిష్కారానికి ప్రత్యామ్నాయంగా వచ్చిన ఈ విధానం త్వరలోనే ప్రముఖ వ్యవస్థగా రూపాంతరం చెందుతుందని తెలిపారు. భారత్‌లో ఇటీవల అంతర్జాతీయ మధ్యవర్తిత్వ న్యాయస్థానాలు రెండు ఏర్పాటయ్యాయని వెల్లడించారు.

కొత్త ఎంపీలతో మమత భేటీ
లోక్‌సభలో అనుసరించే వ్యూహాలపై చర్చ

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ శనివారం తమ పార్టీ నుంచి ఎంపీలుగా ఎన్నికైన వారితో భేటీ అయ్యారు. లోక్‌సభలో తృణమూల్ కాంగ్రెస్ అనుసరించే వ్యూహాలపై చర్చించారు. లోక్‌సభలో పార్టీకి ప్రాతినిధ్యం వహించే నేత ఎవరన్న దానిపై సమాలోచనలు జరిగినట్లు టీఎంసీ నేత ఒకరు చెప్పారు. ఎన్నికల ఫలితాలు, ఓడిపోయిన స్థానాల మీదా చర్చించినట్లు తెలిపారు. టీఎంసీ తరపున లోక్‌సభకు తొలిసారి ఎన్నికైన ఎంపీలు యూసుఫ్ పఠాన్, రచనా బెనర్జీ, మితాలీ బాగ్, జగదీశ్ చంద్ర బర్మ బసునియాకు మమతా బెనర్జీ శుభాకాంక్షలు తెలిపారు. బెంగాల్‌లో టీఎంసీ ఆధిక్యత కొనసాగించింది. 42కుగాను 29 లోక్‌సభ స్థానాలను గెలుచుకుంది. బీజేపీని 12 స్థానాలకు కట్టడి చేసింది. కాంగ్రెస్ కేవలం ఒక్క స్థానంతో సరిపెట్టుకోవల్సి వచ్చింది. గత లోక్‌సభలో సుదీప్ బందోపాధ్యాయ (75) టీఎంసీ శాసనసభాపక్ష నేతగా వ్యవహరించారు. బందోపాధ్యాయ వరుసగా నాల్గోసారి ఉత్తర కోల్‌కతా నుంచి లోక్‌సభకు ఎన్నికయ్యారు. సమావేశానికి లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలతో పాటు పార్టీ జిల్లా అధ్యక్షులు హాజరయ్యారు.

మోదీ ప్రమాణ స్వీకారోత్సవానికి రజనీకాంత్‌కు ఆహ్వానం

చెన్నై: ప్రధాని నరేంద్రమోదీ ప్రమాణస్వీకారోత్సవానికి హాజరు కావాలంటూ తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్‌కు ఆహ్వానం అందింది. దేశ ప్రధానిగా నరేంద్ర మోదీ ఈ నెల 9న మూడోసారి ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఆ ప్రమాణ స్వీకారోత్సవానికి దేశవిదేశాలకు చెందిన ప్రముఖులు అనేక మందిని ఆహ్వానిస్తున్నారు. ఆ మేరకు దిల్లీలో జరిగే ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి హాజరుకావాలని పీఎంవో నుంచి రజనీకాంత్‌కు ఆహ్వానం వచ్చినట్టు సమాచారం. అలాగే ఈ నెల 12న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఆ కార్యక్రమానికి కూడా రజనీకాంత్‌కు ఆహ్వానం పంపించినట్టు వార్తలు వచ్చాయి. దీంతో దిల్లీ, అమరావతిలో జరిగే మోదీ, చంద్రబాబు ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాలకు రజనీకాంత్ హాజరుకానున్నారు.

ఉపాధి కల్పన

కొత్త ప్రభుత్వానికి సవాల్

- మరుగునపడ్డ జాతీయ ఉపాధి విధానం
- ప్రైవేటుకు పెద్ద పీటతో లభించని పరిష్కారం
- యువతలో పెరిగిన నిరుద్యోగం

న్యూఢిల్లీ:
దేశాన్ని నిరుద్యోగ సమస్య పట్టిపీడిస్తోంది. పదేళ్ల ఎన్డీయే పాలనలో అపరిష్కృతంగా మిగిలిన ఈ సమస్యకు ఇప్పుడు పరిష్కారం సాధ్యమా అన్నది ప్రశ్నార్థకమైంది. మూడవ సారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు ఎన్డీయే సిద్ధమైంది. కొత్త ప్రభుత్వానికి అతిపెద్ద సవాల్‌గా ఉద్యోగ కల్పన మారింది. యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాల కల్పన విషయంలో ప్రభుత్వ పంథా మారితేనే ఏదైనా ఫలితం ఉండవచ్చు. ఇందుకోసం మొదటగా జాతీయ ఉపాధి విధానాన్ని అనుసరించడమే ప్రభుత్వం చేయాల్సింది. కానీ ఎన్డీయే పాలనలో ఈ విధానం మరుగునపడింది. 2014లో కాంగ్రెస్ ప్రభుత్వం జాతీయ ఉపాధి విధానంపై చర్చలు జరిపినప్పటికీ తర్వాత అధికారం చేపట్టిన ఎన్డీయే దానిని ముందుకు తీసుకెళ్లడానికి ఎలాంటి ప్రణాళిక లేదని పార్లమెంటుకు తెలిపింది. దేశ కార్మిక మార్కెట్‌లో అసంఘటిత రంగానిదే పెద్దవాటా. 90 శాతానికిపైగా కార్మికులు ఈ రంగంలో ఉన్నారు. కార్మికులకు సామాజిక భద్రత కల్పనతో పాటు ఉద్యోగాలు సృష్టికి పటిష్ఠ చర్యలు తీసుకునేందుకు అందరి అభిప్రాయాలు సేకరించడం ప్రభుత్వానికి అవసరం. ఉద్యోగాలు సృష్టించగల సామర్థ్యాన్ని బట్టి ప్రైవేటు రంగానికి కల్పించే ప్రోత్సాహకాలను పునఃసమీక్షించడంపై దృష్టి కేంద్రీకరించడం ముఖ్యం. ఎన్డీయే ప్రభుత్వ ఆర్థిక విధానాలలో వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత లేదు. ఉపాధి కల్పనలో వ్యవసాయ రంగానిదే పెద్ద వాటా. ఆర్థిక సర్వే 2022-23 ప్రకారం గ్రామీణ జనాభాలో 65 శాతం, దేశం మొత్తం జనాభాలో 47 శాతానికి వ్యవసాయమే జీవనాధారమని తేలింది. వ్యవసాయదారులకు సముచిత ఆదాయం లేకపోవడం సమస్యగా ఉంది. 2020లో మూడు వివాదాస్పద సాగు చట్టాలను కేంద్రప్రభుత్వం తీసుకొచ్చి...కార్పొరేట్ సంస్థలకు దాసోహం చేసేందుకు ప్రయత్నించింది. రైతాంగ పోరాటం కారణంగా మూడు నల్ల చట్టాలు ఉపసంహరించుకోక తప్పలేదు. రైతుల డిమాండ్లు నేటికీ పరిష్కరించలేదు. అమెరికా, యూరోపియన్ యూనియన్ సైతం సాగు చట్టం, ఉమ్మడి వ్యవసాయ విధానం వంటివి అనుసరిస్తుంటే... భారత్ ఆ దిశగా నిర్ణయం తీసుకోలేకపోతోంది.

భారత్‌లో యువ జనాభా ఎక్కువ. పటిష్ఠ చర్యల ద్వారా యువ కార్మికశక్తిని పెంచుకోవచ్చు కానీ అందులోనూ ఎన్డీయే ప్రభుత్వం విఫలమవుతోంది. నిరుద్యోగాన్ని తారస్థాయికి చేర్చింది. ప్రభుత్వ ఉద్యోగాల్లో ఖాళీలు భర్తీ చేయకుండా తాత్సారం చేస్తూ నిరుద్యోగాన్ని మరింత పెంచుతోంది. నియామకాలకు సంబంధించిన పరీక్షలు సక్రమంగా నిర్వహించడంలో విఫలమవుతోంది. ఫలితంగా యువతలో అసహనం పెరిగింది. దీని ఫలితం తాజా ఎన్నికల్లో కనిపించింది.

ప్రభుత్వ రంగాన్ని బలహీన పరుస్తూ పెట్టుబడుదల ఆశతో ప్రైవేటు రంగానికి పెద్ద పీట వేస్తూ... అనేక రాయితీలు, ప్రోత్సాహకాలు అందిస్తున్న ఎన్డీయే ప్రభుత్వం... ఇప్పటికైనా తన విధానాలు మార్చుకోవాలి. 2019లో ప్రైవేటు కంపెనీలకు ఇచ్చిన పన్ను మినహాయింపుతో ఆ ఆర్థిక సంవత్సరంలో లక్షకోట్ల రూపాయల (ట్రిలియన్) పన్ను భారాన్ని ప్రభుత్వం మోయాల్సి వచ్చింది. కోవిడ్ తర్వాత ఆర్థిక వ్యవస్థకు చోదకశక్తి కోసం ప్రైవేటు పెట్టుబడుల కోసం ఎర్ర తివాచీ పరిచి పెట్టుబడులు, ఉద్యోగాలను ఆకాంక్షించింది. పీఎల్ఐ పథకం ద్వారా ప్రైవేటు పెట్టుబడులు ఆకర్షించే ప్రయత్నం చేసింది కానీ అవేమీ సత్ఫలితాలు ఇవ్వలేదు. ప్రస్తుతం 'మోదీ కీ గ్యారెంటీ'ని ప్రజలు నమ్మలేదు. అంతర్జాతీయ కార్మిక సంఘం పిలుపుఇచ్చిన విధంగా గౌరవమైన పని కోరుకుంటున్నారు. మహిళలు, పురుషులు అన్ని రంగాల్లో, పరిస్థితుల్లో పనిచేసేందుకు వీలుగా ఉపాధి/ఉద్యోగ కల్పనను ఆకాంక్షిస్తున్నారు. స్వేచ్ఛ, సమానత్వం, భద్రత, గౌరవంతో కూడిన పని ఆశిస్తున్నారు. ఈ దిశగా కొత్త ప్రభుత్వం ఏ మేరకు చర్యలు తీసుకోగలదన్నది వేచిచూడాల్సిందే!

అత్యాచారాలు, హత్యలు జరిగినా మీకు పర్వాలేదా?
మహిళా కానిస్టేబుల్‌కు మద్దతిచ్చిన వారిపై కంగన ఆగ్రహం

న్యూఢిల్లీ: బాలీవుడ్ నటి, బీజేపీ ఎంపీ కంగన రనౌత్‌ను చండీగఢ్ విమానాశ్రయంలో ఓ సీఐఎస్ఎఫ్ మహిళా కానిస్టేబుల్ చెంపదెబ్బ కొట్టిన ఘటన కలకలం సృష్టించిన సంగతి తెలిసిందే. దీనిపై నెట్టింట భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు ఆమెకు మద్దతుగా నిలవగా... మరికొందరు కానిస్టేబుల్ చర్యను సమర్థిస్తున్నారు. ఈ క్రమంలోనే దాడి ఘటనపై మరోసారి స్పందించిన కంగన... ఎక్స్ వేదికగా సుదీర్ఘ పోస్ట్ పెట్టారు. 'ఇక అత్యాచారాలు, హత్యలు జరిగినా మీకేం పర్వాలేదా?' అంటూ కానిస్టేబుల్‌కు మద్దతిచ్చిన వారిని ఉద్దేశిస్తూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. 'అత్యాచారానికి పాల్పడినవాడు... హంతకుడు... దొంగ... ఇలా నేరం చేసినవారు ఎవరైనా భావోద్వేగ, మానసిక, ఆర్థికపరమైన కారణాలు చెబుతుంటారు. కారణం లేకుండా ఏ నేరం జరగదు. అయినా సరే చేసిన నేరానికి వారిని దోషిగా తేల్చి శిక్ష విధిస్తారు. అలా కాదని చట్టాన్ని ఉల్లంఘించి నేరాలకు పాల్పడిన క్రిమినల్స్ భావోద్వేగాలకు విలువిస్తే... అనుమతి లేకుండా ఓ వ్యక్తి శరీరాన్ని తాకడం, వారిపై దాడి చేయడం వంటి ఘటనలను మీరు సమర్థిస్తే... అత్యాచారాలు, హత్యల వంటివి జరిగినా మీకేం ఫర్వాలేదనే అర్థం. మీలాంటివారు మీ మానసిక పరిస్థితిపై మరింత దృష్టిపెట్టుకోవాలి. యోగా, ధ్యానం చేయండి. లేదంటే జీవితం చేదు అనుభవంగా మారుతుంది. పగ, ద్వేషం, అసూయతో ఉండకండి. వాటినుంచి ఇకనైనా విముక్తి పొందండి' అని కంగనా రాసుకొచ్చారు. గత గురువారం దిల్లీ విమానాశ్రయంలో భద్రతా తనిఖీ చేసుకొని ముందుకువెళుతున్న కంగనను అక్కడ విధులు నిర్వహిస్తున్న సీఐఎస్ఎఫ్ మహిళా కానిస్టేబుల్ కుల్విందర్ కౌర్ చెంపపై కొట్టారు. దీంతో భద్రతా అధికారులు కంగన చుట్టూ వలయంగా ఏర్పడ్డారు. ఇందుకు సంబంధించిన వీడియోలు వైరల్‌గా మారాయి. సాగు చట్టాలకు వ్యతిరేకంగా దిల్లీ సరిహద్దుల్లో గతంలో ఆందోళన నిర్వహించిన మహిళా రైతుల విషయంలో కంగన అనుచిత వ్యాఖ్యలు చేశారని, అందుకే కొట్టానని ఆ కానిస్టేబుల్ చెప్పారు. ఈ ఘటనపై బాలీవుడ్ ప్రముఖులు స్పందించకపోవడంపై కంగనా ఆగ్రహం వ్యక్తంచేశారు.

నా వారసుడిని ఒడిశా ప్రజలే నిర్ణయిస్తారు
పాండియన్ నిబద్ధతగల నేత: ఆయనపై విమర్శలు తగవు: నవీన్ పట్నాయక్



భువనేశ్వర్: తన రాజకీయ వారసుడు ఎవరన్నది ఒడిశా ప్రజలే నిర్ణయిస్తారని బీజేపీ అధ్యక్షుడు, రాష్ట్ర మాజీ సీఎం నవీన్ పట్నాయక్ తెలిపారు. పార్టీ సీనియర్ నేత వీకే పాండియన్‌పై విమర్శలను ఖండించారు. ఆయన తనకు రాజకీయ వారసుడు కాదని మాత్రమే చెప్పానన్నారు. ప్యాండియన్ మంచి నాయకుడని, రాష్ట్ర అభివృద్ధి ఎంతగానో దోహదమయ్యారని చెప్పారు. ఆరోగ్యం, విద్య, క్రీడల శాఖలతో పాటు ఆలయాల పునరుద్ధరణకు చేపట్టిన కార్యక్రమానికి గణనీయమైన తోడ్పాటు అందించారని పాండియన్‌ను పట్నాయక్ ప్రశంసించారు. ఆయన పార్టీలో చేరాక పదవులు చేపట్టలేదని చెప్పారు. కోవిడ్-19 సమయంలో, రెండు తుపానుల వల్ల రాష్ట్రంలో సంక్షోభం ఏర్పడినప్పుడు అధికారిగా ఉన్న పాండియన్ అద్భుతంగా పనిచేశారని నవీన్ పట్నాయక్ కొనియాడారు. బ్యూరోక్రాట్‌గా పదవీ విరమణ పొందిన తర్వాత పార్టీలోకి వచ్చి నిబద్ధతతో, నిజాయితీగా పనిచేశారని, అందుకోసం ఆయనను గౌరవించాలని పట్నాయక్ అన్నారు. ఎన్నికల ఫలితాలపై మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా తన హయాంలో చేసిన పనులకు, పార్టీ విజయాలకు గర్వపడుతున్నట్లు తెలిపారు. గొప్పగా సేవలు అందించాలనే అనునిత్యం ప్రయత్నించినట్లు చెప్పారు. ప్రజాస్వామ్యంలో గెలుపోటములు సహజమేనని, సుదీర్ఘకాలం తర్వాత ఓటమిని చవి చూశానన్నారు. ప్రజల తీర్పును గౌరవించాలని ఆయన అన్నారు. ఒడిశాలోని 4.5కోట్ల మంది తన కుటుంబమని, వారి కోసం చివరి వరకు సేవ చేస్తానని నవీన్ పట్నాయక్ తెలిపారు.

మణిపూర్‌లో హింసాత్మక ఘటనలు
పోలీస్ స్థావరాలపై దాడులు

ఇంఫాల్/న్యూఢిల్లీ: మణిపూర్‌లో హింసాత్మక ఘటనలు ఆగడం లేదు. తాజాగా మణిపూర్‌లోని జిరిబమ్ జిల్లాలో కొందరు అనుమానిత తిరుగుబాటుదారులు పోలీస్ స్థావరాలపై దాడిచేయడంతో పాటు కొన్ని నివాసాలకు నిప్పు పెట్టినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. జిరిబమ్ జిల్లా పక్కనే ఉన్న బరాక్ నది నుండి మూడు, నాలుగు పడవల్లో తిరుగుబాటుదారులు వచ్చినట్లు ఆ వర్గాలు పేర్కొన్నాయి. శుక్రవారం అర్ధరాత్రి 12.30 గంటల సమయంలో జిరిబమ్‌లోని ఛోటోబక్రాలో దాడి ప్రారంభమైనట్లు పోలీస్ ఉన్నతాధికారులు తెలిపారు. మొదట ఛోటోబక్రా పోలీస్ స్థావరంపై దాడి జరిగిందని, అనంతరం లాంటైఖునౌ, మోధుపూర్‌లోని పోలీస్ స్థావరాలపై తిరుగుబాటుదారులు దాడి చేసినట్లు వెల్లడించారు. ఛోటోబక్రాకు కొన్ని కిలోమీటర్ల దూరంలో ఉన్న బోరోబక్రాలోని పోలీస్ స్థావరంపై 2.30 గంటల ప్రాంతంలో దాడి జరిగినట్లు మరో పోలీస్ అధికారి తెలిపారు. అనుమానిత తిరుగుబాటుదారులు నది ఒడ్డున ఉన్న అనేక గ్రామాలపైనా దాడి చేసినట్లు పోలీస్ అధికారులు తెలిపారు. గ్రామాల్లోని చాలా నివాసాలకు దుండగులు నిప్పుపెట్టిన అనంతరం నృత్యం చేస్తున్న దృశ్యాలు మీడియాలో కనిపించాయని అన్నారు. జిరిబమ్ పట్టణ శివారుల్లో నివసిస్తున్న 250 మంది మెయితీలను అస్సాం రైఫిల్స్ శుక్రవారం తరలించింది. గురువారం ఈ ప్రాంతానికి చెందిన 59 ఏళ్ల వ్యక్తిని కుకీ తిరుగుబాటుదారులు హత్య చేశారంటూ మెయితీ వర్గం ఆరోపించింది. దీంతో తమకు రక్షణ కల్పించాలని మెయితీలు శుక్రవారం ఆందోళన చేపట్టారు. తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో కొంతమందిని ఇక్కడి నుండి తరలించినట్లు అస్సాం రైఫిల్స్ పేర్కొన్నాయి.

కేంద్రమంత్రి పదవిపై అన్నామలై ఆశలు



చెన్నై: రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఓటు బ్యాంక్ పెంచిన ఉత్సాహంతో దిల్లీ వెళ్లిన ఆ పార్టీ తమిళనాడు రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై కేంద్ర మంత్రివర్గంలో చోటు సంపాదించుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఇప్పటికే బీజేపీ జాతీయ నాయకులతో ఆయన మంతనాలు జరుపుతున్నారు. ఈ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి ఘోర పరాజయాన్ని చవిచూసినా ఓటు బ్యాంక్ పెరిగి పార్టీ ప్రతిష్ఠ ఉన్నతస్థితికి చేరిందని అన్నామలై చెబుతున్నారు. గతంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షులుగా పనిచేసినవారికి మంత్రి పదవులు, గవర్నర్ పదవులు ఇచ్చినట్లే ఈసారి పార్టీ అధిష్ఠానం తనకు తప్పకుండా మంత్రి పదవి కట్టబెడుతుందని ఆశపడుతున్నారు. గతంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షులుగా పనిచేసిన ఇలా గణేషన్, సీపీ రాధాకృష్ణన్, తమిళిసైను గవర్నర్లుగా నియమించిందని, తనకు ముందు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేసిన ఎల్.మురుగన్‌కు కేంద్రమంత్రి వర్గంలో స్థానం కల్పించారని, ఆ వరుసలోనే తనకు కూడా కేంద్ర మంత్రిపదవి తప్పకుండా లభిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా తాను పార్టీ పగ్గాలు స్వీకరించినప్పటి నుండే పార్టీ ప్రతిష్ఠ క్రమంగా పెరుగుతూ వచ్చిందని, లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ ఓటు బ్యాంక్ 11.5 శాతానికి పెరిగిందని ఆయన చెబుతున్నారు. అన్నామలై ఇమేజ్ వల్ల పార్టీకి ఓటు బ్యాంక్ పెరగలేదని, ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల వ్యక్తిగత కీర్తిని చూసే ఓటర్లు ఓటువేశారని కొన్ని వర్గాలు చెబుతున్నాయి. ఏది ఏమైనప్పటికీ తనకు కేంద్రమంత్రి వర్గంలో తప్పకుండా స్థానం లభిస్తుందని అన్నామలై ధీమా వ్యక్తం చేస్తున్నారు. దేశ వ్యాప్తంగా బీజేపీ తరపున పోటీ చేసిన అభ్యర్థుల వివరాలన్నీ మోదీ వద్ద ఉన్నాయని, వాటిని పరిశీలించిన మీదటే ఎవరికి ఏ మంత్రిత్వ శాఖ కేటాయించాలనే విషయంపై నిర్ణయం తీసుకుంటారని స్థానిక నాయకులు చెబుతున్నారు. మొత్తంమీద అన్నామలై దిల్లీలో పాగా వేసి మంత్రి పదవి కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు.

ఇక పూర్తిస్థాయి రాజకీయాలు: నిఖిల్ కుమారస్వామి

బెంగళూరు: ఇకపై సినిమాలకు స్వస్తి చెబుతున్నానని, పూర్తిస్థాయిలో రాజకీయాలకే పరిమితమవుతానని జేడీఎస్ యువ విభాగం అధ్యక్షుడు నిఖిల్ కుమారస్వామి తెలిపారు. మండ్యలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇక సినిమాలు చేయదలచుకోలేదని అన్నారు. పూర్తిగా రాజకీయాల్లోనే ఉంటానని తెలిపారు. కుమారస్వామిపై మండ్య ప్రజలు చూపిన గౌరవం, ప్రేమ, అభిమానాలను కాపాడుకుంటామని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని బలోపేతం చేయాలన్నది కుమారస్వామి ఆశయమన్నారు. దూరదృష్టి ఉన్నందునే బీజేపీతో కలిసి ముందుకెళ్లామని చెప్పారు. కాంగ్రెస్ విమర్శలకు మండ్య ప్రజలు గుణపాఠం చెప్పారన్నారు. కుమారస్వామి కేంద్రంలో మంత్రి పదవి కోరేది ఉండదని, కానీ సీనియారిటీ ప్రకారం అవకాశం దక్కుతుందన్నారు. ఇకపై పార్టీని బలోపేతం చేసేందుకు రాష్ట్రమంతా తిరుగుతానన్నారు. రాష్ట్రానికి కుమారస్వామి రెండుసార్లు ముఖ్యమంత్రిగా చేసిన సేవలు అపారమన్నారు. అన్నివర్గాల ప్రజలు కుమారస్వామికి ఆశీస్సులు అందించారని తెలిపారు.

నిర్ణయాల్లో దూకుడుకు కళ్లెం
బీజేపీ బలం తగ్గడంపై మూడీస్

న్యూఢిల్లీ: కేంద్రంలో మళ్లీ మోదీ ప్రధాని పదవి చేపడుతున్నా... బీజేపీ బలం భారీగా తగ్గిందని మూడీస్ రేటింగ్స్ వెల్లడించింది. మూడు ప్రభుత్వ రంగ బ్యాంకులు- బ్యాంక్ ఆఫ్ బరోడా, కెనరా బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లలో బీఏఏ 3 రేటింగ్‌లను మూడీస్ ధ్రువీకరించింది. ఈ బ్యాంకుల రేటింగ్‌లపై రేటింగ్ ఏజెన్సీ స్థిరమైన దృక్పథాన్ని కొనసాగించింది. అదే సమయంలో మోదీ మూడోసారి ప్రధానమంత్రి కాబోతున్నప్పటికీ, బీజేపీ బాగా బలహీనపడిందని స్పష్టం చేసింది. 'భారత ఎన్నికల సమీక్ష, సంకీర్ణ ప్రభుత్వంలోకి బీజేపీని చేర్చిన ఓటర్లు' పేరుతో ఒక నివేదికను విడుదల చేసింది. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు పార్లమెంటులో లెక్కలు మార్చాయని, సంకీర్ణ ప్రభుత్వంలో నిర్ణయాలు తీసుకోవడం కష్టంగా మారుతుందని వెల్లడించింది. కేంద్ర ప్రభుత్వాన్ని నడిపించేందుకు బీజేపీ కొన్నిసార్లు రాజీపడాల్సి ఉంటుందని అభిప్రాయపడింది. తద్వారా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోవడంలో ఆలస్యం చేస్తుందని తెలిపింది. కీలక నిర్ణయాల నుంచి బీజేపీ తప్పుకోవాల్సి రావొచ్చని చెప్పింది. లోక్‌సభ ఎన్నికల్లో రాజకీయ స్థిరత్వం తగ్గడం, సంకీర్ణ ప్రభుత్వంలో ఏకాభిప్రాయ సాధన అవసరం ఉండటం వంటి అంశాలు పెట్టుబడిదారుల్లో విశ్వాసాన్ని తగ్గించవచ్చని మూడీస్ ఆర్థికవేత్త అదితి చెప్పారు. ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, సామాజిక, ఆర్థిక అసమానతలు తదితర సమస్యల పరిష్కారంలో మోదీ ప్రభుత్వం ఎలా ముందుకెళుతుందనే అంశాన్ని మార్కెట్లు గమనిస్తాయని అన్నారు. సంకీర్ణ ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలపైనే భారత అభివృద్ధి ఆధారపడి ఉంటుందని తెలిపారు. రానున్న ఐదేళ్లు మోదీకి క్లిష్ట సవాళ్లు ఎదురుకాబోతున్నాయని స్పష్టం చేశారు.

ప్రతికూల రాజకీయాలకు ముగింపు

అఖిలేశ్

లక్నో: దేశంలో ప్రతికూల రాజకీయాలు ముగిశాయని, సానుకూల రాజకీయాలకు ఇది ఆరంభమని సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ తెలిపారు. ప్రజాంశాలదే విజయమని సార్వత్రిక ఎన్నికల ఫలితాలనుద్దేశించి అన్నారు. అఖిలేశ్ శనివారం లక్నోలోని తమ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల్లో గెలుపుపై ఆనందం వ్యక్తంచేశారు. ఇండియా ఐక్య సంఘటన విజేతగా నిలిచిందని, పీడీఏ (వెనుకబడిన, దళితులు, అల్పసంఖ్యాకులు) వ్యూహం ఫలించిందన్నారు. సమాజ్‌వాదీ పార్టీ మూడవ అతిపెద్ద పార్టీగా ఆవిర్భవించిందని, దీంతో తమ బాధ్యత మరింత పెరిగిందన్నారు. తమ అభిప్రాయాలు వ్యక్తం చేయడానికి ముందు ప్రజలు, వారి ప్రయోజనాల గురించి ఆలోచిస్తామన్నారు. ప్రజలకు గరిష్ఠ సేవ చేయడమే తమ పార్టీ లక్ష్యంగా తెలిపారు. లోక్‌సభలో ప్రజల గొంతకవుతామని చెప్పారు. ప్రజల నుంచి అమితాదరణ లభించిందని ఎస్పీకి లభించిందని అఖిలేశ్ అన్నారు. సమావేశంలో సీనియర్ నేతలు శివపాల్ సింగ్ యాదవ్, రాంగోపాల్ యాదవ్, కొత్త ఎంపీలు డింపుల్ యాదవ్, ధర్మేంద్ర యాదవ్, ఆదిత్య యాదవ్ అక్షయ యాదవ్, అఫ్జల్ అన్సారీ పాల్గొన్నారు. కాగా, సార్వత్రిక ఎన్నికల్లో ఇండియా ఐక్య సంఘటనలో భాగంగా యూపీలోని 80కుగాను 37 స్థానాలను ఎస్పీ, ఆరు స్థానాలను కాంగ్రెస్ గెలుచుకున్నాయి. బీజేపీ 33 స్థానాల్లో గెలవగా, బీఎస్పీ ఖాతా తెరవలేకపోయింది.

'నీట్' అక్రమాలపై సుప్రీం దర్యాప్తు...

నీట్ పరీక్షలో రిగ్గింగ్ ఆరోపణలపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు జరిపించాలని అఖిలేశ్ యాదవ్ డిమాండ్ చేశారు. ఈ వ్యవహారాన్ని సర్వోన్నత న్యాయస్థానం సుమోటోగా స్వీకరించాలని, సమగ్రంగా దర్యాప్తు జరిపించి, దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు. వందల మందికి నూటికి నూరుశాతం మార్కులు రావడాన్ని అఖిలేశ్ ప్రశ్నించారు. ఒకే కేంద్రంలో పరీక్ష రాసిన విద్యార్థుల్లో కొందరికి నూరుశాతం మార్కులు రావడం పెద్ద కుంభకోణాన్ని సూచిస్తున్నదన్నారు.

బీజేపీ పాలనలో పరీక్షలు వ్యాపారంగా మారాయని విమర్శించారు. అక్రమ పద్ధతుల్లో పరీక్షా పత్రాలు బయటకు వస్తున్నాయని, పరీక్షా కేంద్రాలతో కుమ్మక్కై, ఫలితాలు మార్చేస్తుండటం జరుగుతున్నదన్నారు. చాలా పరీక్షల్లో ఇలాగే జరిగినట్లు తెలిపారు. దీనివల్ల దేశ యువతకు ప్రభుత్వ యంత్రాంగంపై విశ్వాసం సన్నగిల్లుతోందని, యువత అసహనానికి గురవ్వడమంటే అర్థం భవిష్యత్‌పై ఆశలు వదిలేసుకోవడమేనని వ్యాఖ్యానించారు. పరీక్షలకు సంబంధించి ఇది అతిపెద్ద కుంభకోణమని, దీనిని సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించాలన్నారు. సమగ్ర దర్యాప్తు జరిపించి, దోషులను కఠినంగా శిక్షించాలని, భవిష్యత్‌లో ఇలాంటివి పునరావృతం కాకుండా కోర్టు తగిన చర్యలు తీసుకోవాలని 'ఎక్స్'లో అఖిలేశ్ కోరారు.

నితీశ్‌కు 'ఇండియా' ప్రధాని ప్రతిపాదన

కేసీ త్యాగీ వెల్లడి... తోసిపుచ్చిన కాంగ్రెస్

న్యూఢిల్లీ: ఎన్డీఏ కూటమి మెజారిటీ మార్క్(272) దాటి 293 స్థానాలు గెలుపొందడంతో మూడోసారి ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు సన్నద్ధమవుతోంది. నరేంద్ర మోదీ ప్రధానమంత్రిగా ప్రమాణస్వీకారం చేసేందుకు ముహూర్తం ఖరారైంది. ఈ తరుణంలో దేశ రాజకీయాలను కుదుపు కుదిపేసేలా ఓ రాజకీయ నేత సంచలన ప్రకటన చేశారు. బీహార్ సీఎం, జనతాదళ్ (యు) అధ్యక్షుడు నితీశ్ కుమార్‌కు ప్రధాని పదవి ప్రతిపాదించారంటూ బాంబు పేల్చారు. ఆ పార్టీకి చెందిన కేసీ త్యాగి ఓ ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశారు. ఓ జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో కేసీ త్యాగి మాట్లాడుతూ 'నితీశ్ కుమార్‌కు ఇండియా ఐక్య సంఘటన నుంచి ప్రధాని పదవి ప్రతిపాదన వచ్చింది. నితీశ్‌ను ఈ కూటమికి కన్వీనర్ చేసేందుకు ఎవరైతే అనుమతించలేదో... ఆ వ్యక్తుల నుంచే ఈ ప్రతిపాదన ఆయనకు వచ్చింది. కానీ తాను ఎన్డీఏ కూటమిలోనే కొనసాగుతానని చెప్పి, ఆ ప్రతిపాదనను నితీశ్ తిరస్కరించారు' అని చెప్పుకొచ్చారు. ఈ ప్రతిపాదన చేసిన నాయకులు ఎవరని ప్రశ్నించగా... అందుకు జవాబు చెప్పడానికి త్యాగి నిరాకరించారు. ప్రధాని పదవి ప్రతిపాదనతో కొందరు నాయకులు నేరుగా నితీశ్‌ని సంప్రదించాలని అనుకున్నారని చెప్పారు కానీ, వారి పేర్లు బయటపెట్టలేదు. తాము ఇండియా ఐక్య సంఘటనను విడిచిపెట్టి ఎన్డీఏలో చేరామని, ఇకపై వెనుదిరిగి చూసే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. మరోవైపు, కేసీ త్యాగి వ్యాఖ్యలను కాంగ్రెస్ తోసిపుచ్చింది. ఆయన మాటల్లో ఏమాత్రం వాస్తవం లేదని, నితీశ్‌కు ఎవరూ పీఎం పదవి ప్రతిపాదించలేదని స్పష్టత ఇచ్చింది. ఈ అంశంపై కాంగ్రెస్ సీనియర్ నేత కేసీ వేణుగోపాల్ మాట్లాడుతూ... కేసీ త్యాగి చేసిన వ్యాఖ్యల్లో వాస్తవం లేదని, అలాంటి సమాచారం తమకు అందలేదన్నారు. తనకు తెలిసినంత వరకు కేసీ త్యాగి ఒక్కరికే ఈ విషయం తెలిసి ఉంటుందని వ్యంగ్యంగా మాట్లాడారు. ఎన్నికల ఫలితాలు వచ్చాక తాము నితీశ్‌కుమార్‌ని సంప్రదించలేదని, ఇదొక అసత్య ప్రచారమని ఆయన తేల్చి చెప్పారు.

'అగ్నిపథ్' ఉపసంహరించాలి

- కులగణనకు తక్షణ చర్యలు
- బీహార్‌కు ప్రత్యేక హోదా కల్పించాలి
- అధికారిక భాషగా భోజ్‌పురిని గుర్తించాలి
- కేంద్రానికి సీపీఐ(ఎంఎల్) డిమాండ్

పాట్నా: సైనికులకు అన్యాయం చేస్తున్న అగ్నిపథ్ పథకాన్ని తక్షణమే రద్దు చేయాలని కేంద్రప్రభుత్వాన్ని సీపీఐ(ఎంఎల్) డిమాండ్ చేసింది. దేశవ్యాప్తంగా కులగణన నిర్వహించాలని, భోజ్‌పురికి అధికారిక భాష హోదా కల్పించే రాజ్యాంగ ఎనిమిదవ షెడ్యూల్‌లో చేర్చాలని, బీహార్ సమగ్రాభివృద్ధి కోసం దానికి ప్రత్యేక హోదా కల్పించాలని కూడా డిమాండ్ చేసింది. ఇండియా ఐక్య సంఘటన మిత్రపక్షంగా సీపీఐ(ఎంఎల్) బలంగా ముందుకెళుతోంది. బీహార్‌లోని రెండు లోక్‌సభ స్థానాలను గెలుచుకుంది. ఆరా, కరాకత్ స్థానాలను కైవసం చేసుకుంది. సుమారు మూడు దశాబ్దాల తర్వాత గెలుపొందింది. సీపీఐ(ఎంఎల్) ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య శనివారం విలేకరులతో మాట్లాడుతూ అగ్నిపథ్ పథకాన్ని రద్దు చేయాలని ఇండియా ఐక్య కూటమి ముందు నుంచి డిమాండ్ చేస్తున్నదన్నారు. అన్యాయమైన వివక్షపూరిత పథకాన్ని వెంటనే రద్దు చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఇండియా ఐక్య సంఘటన డిమాండ్ చేస్తున్నట్లు దేశవ్యాప్తంగా కులగణన నిర్వహించాలని, తద్వారా ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వర్గాలను గుర్తించి, వారి సంక్షేమానికి తగిన చర్యలను ప్రభుత్వం తీసుకోవాలన్నారు. రాజ్యాంగంలోని ఎనిమిదవ షెడ్యూల్‌లో భోజ్‌పురి భాషను చేర్చాలన్న దీర్ఘకాల డిమాండ్‌ను పునరుద్ధరిస్తున్నట్లు వెల్లడించారు. కులగణన అత్యవసరమని దీపాంకర్ భట్టాచార్య స్పష్టంచేశారు. కులగణన ప్రక్రియను వెంటనే మొదలుపెట్టేలా కేంద్రంపై ఒత్తిడి తెస్తామన్నారు. బీహార్‌కు ప్రత్యేక హోదా డిమాండ్ గురించి మాట్లాడుతూ ఎన్డీయే కూటమిలో భాగంగా ఉన్న నితీశ్ కుమార్ ఇందుకోసం ఒత్తిడి తెస్తారని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేక హోదా లభిస్తే రాష్ట్రంలో సమగ్రాభివృద్ధి వేగంగా జరుగుతుందని, ఉద్యోగావకాశాలు పెరుగుతాయని, పెట్టుబడులు వస్తాయన్నారు. ప్రపంచ గుర్తింపు పొందిన భోజ్‌పురికి అధికారిక భాష హోదాను తక్షణమే కల్పించాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. బీహార్‌తో పాటు జార్ఖండ్‌లో ఈ భాషకు ఆదరణ ఉన్నట్లు తెలిపారు. భోజ్‌పూర్, రొహతస్, కైమూర్, బక్సర్, శరణ్, తూర్పు చంపారన్, పశ్చిమ చంపారన్, గోపాల్ గంజ్, శివన్, జెహానాబాద్‌తో పాటు జార్ఖండ్‌లోని అనేక చోట్ల భోజ్‌పురిలో మాట్లాడతారని దీపాంకర్ భట్టాచార్య వెల్లడించారు. షెడ్యూల్డ్ హోదా దక్కితే భాషకు కొన్ని ప్రయోజనాలు లభిస్తాయని, కాలక్రమేణ అది విస్తరించగలదన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే ఇందుకు చర్యలు తీసుకోవాలని దీపాంకర్ భట్టాచార్య కోరారు.

త్వరలో ఇండియా ప్రభుత్వం

- దేశం మార్పు కోరుతోంది
- కొన్నిసార్లు ఒక్కరోజులోనే అధికార మార్పు
- కొత్త సర్కార్ ప్రమాణస్వీకారానికి దూరం: మమతా బెనర్జీ

కోల్‌కతా: బీజేపీ అప్రజాస్వామికంగా, అప్రమంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తోందని తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ విమర్శించారు. ప్రమాణ స్వీకారోత్సవానికి తమ పార్టీ వెళ్లడం లేదని చెప్పారు. దేశం మార్పును కోరుకుంటోందని, మోదీకి వ్యతిరేకంగా ప్రజా తీర్పు వచ్చిందని అన్నారు. 400 లోక్‌సభ స్థానాలు గెలుస్తామని ప్రగల్భాలు పలికిన పార్టీకి మెజారిటీ కూడా రాలేదని ఎద్దేవా చేశారు. సరైన సమయంలో నూతన 'ఇండియా' ప్రభుత్వం ఏర్పాటవుతుందని విశ్వాసం వ్యక్తంచేశారు. అప్పటి వరకు వాళ్లను అధికారాన్ని ఆశ్వాదించనివ్వండని బీజేపీ నేతలనుద్దేశించి మమత వ్యాఖ్యానించారు. 'ఎప్పుడైనా ఏమైనా జరగవచ్చు. కొన్ని సార్లు ప్రభుత్వాలు ఒక్కరోజులోనే మారిపోతాయి. రాబోయే 15 రోజుల్లో ఏం జరుగుతుందో ఎవరికి తెలుసు' అని అన్నారు. కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు ఇండియా ఐక్య సంఘటన ప్రస్తుతానికి వెనక్కు తగ్గింది కానీ త్వరలోనే ముందడుగు వేసేందుకు అవకాశం లేకపోలేదని బెంగాల్ సీఎం అన్నారు. సార్వత్రిక ఎన్నికల తర్వాత తృణమూల్ కాంగ్రెస్ తొలిసారి భేటీ అయిన తర్వాత మమతా బెనర్జీ విలేకరులతో మాట్లాడుతూ బెంగాల్‌లో బీజేపీని కట్టడి చేయడంపై హర్షం వ్యక్తంచేశారు. కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటునకు ఇండియా ఐక్య సంఘటన ఏ క్షణంలోనైనా ముందుకు రావచ్చని చెప్పారు. అందివచ్చే అవకాశాన్ని వదులుకోబోదన్నారు. ఎన్డీయే ప్రభుత్వం అస్థిరంగా, బలహీనంగా ఉన్నప్పుడు 'ఇండియా' దెబ్బ పడుతుందని, ప్రస్తుతానికి వేచి చూద్దామనే స్థితిలో ఉన్నదన్నారు. 'దేశానికి మార్పుకావాలి. ప్రజా తీర్పు మార్పును కోరింది. మోదీకి వ్యతిరేకంగా ఫలితాలు వచ్చాయి కాబట్టి ఆయన ప్రధాని కాకూడదు. మరెవరైనా అధికార బాధ్యతలు చేపట్టాలి. కొత్త ప్రభుత్వ ప్రమాణ స్వీకారోత్సవానికి తృణమూల్ కాంగ్రెస్ హాజరు కాదు' అని అన్నారు. అప్రజాస్వామికంగా, చట్టవిరుద్ధంగా ఏర్పడే బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు సరైన సమయం కోసం ఇండియా ఐక్య సంఘటన వేచివుందన్నారు. పరిస్థితులు అనుకూలించినప్పుడు కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందన్నారు. ఎన్డీయే నేతృత్వ అస్థిరమైన, బలహీన ప్రభుత్వం కూలితే సంతోషిస్తానని మమత అన్నారు. లోక్‌సభ, రాజ్యసభలో టీఎంపీ ఎంపీలు పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) రద్దునకు డిమాండ్ చేస్తారని ఆమె చెప్పారు.

బెంగళూరు గ్రామీణం ఓటమికి బాధ్యత నాదే

ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్

బెంగళూరు: బెంగళూరు గ్రామీణ నియోజకవర్గం ఓటమికి వ్యక్తిగతంగా తనదే బాధ్యత అని ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ తెలిపారు. నగరంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బెంగళూరు గ్రామీణం నుంచి తన తమ్ముడు డీకే సురేశ్ ఓటమికి తన వ్యక్తిగత బాధ్యతగా భావిస్తున్నానన్నారు. ఓటమి నుంచి కోలుకోవాల్సి ఉందన్నారు. ఓడినంత మాత్రాన మౌనంగా ఉండేది లేదన్నారు. కాంగ్రెస్ వ్యతిరేక ఓట్లు ఒక్కటవుతాయని భావించానని చెప్పారు. మైనారిటీల ఓట్లు మినహా బీజేపీ, జేడీఎస్ కార్యకర్తల ఓట్లన్నీ వస్తాయని భావించామన్నారు. ఈ స్థాయిలో ఫలితం ఉంటుందని ఊహించలేదన్నారు. చెన్నపట్టణ ఎమ్మెల్యే స్థానానికి జరిగే ఉప ఎన్నికల్లో డీకే సురేశ్ పోటీ చేసే విషయం ఇంకా ప్రస్తావనకు రాలేదన్నారు. ఇప్పుడిప్పుడే ఓటమి నుంచి కోలుకుంటున్నామని చెప్పారు. ఓడిపోయామని ఇంట్లో కూర్చునేది లేదని, తనను నమ్మిన కార్యకర్తలు, ప్రజలకు శక్తి నింపేలా పనిచేస్తానన్నారు. కార్యకర్తల రక్షణకు ఏం చేయాలో పరిశీలిస్తామన్నారు. ఎంతోమంది పెద్దనాయకులే ఓడిపోయిన సందర్భాలు ఉన్నాయన్నారు. 14 స్థానాల్లో విజయం సాధిస్తామని భావించామన్నారు. ఒక్కస్థానం నుంచి 9 స్థానాలకు పెరిగామన్నారు. ఇంకా ఎక్కువ స్థానాలు లక్ష్యంగా ఉన్నా సాధ్యం కాలేదన్నారు. తన నియోజకవర్గ పరిధిలో డాక్టర్ సీఎన్ మంజునాథ్ గెలుపొందారని, వ్యక్తిగతంగా అభినందిస్తున్నానన్నారు. పార్టీ కంటే అక్కడ వ్యక్తి గెలిచారని పేర్కొన్నారు. ఇంత తేడా ఊహించలేదన్నారు. డీకే సురేశ్ బాగా పనిచేశారని, ప్రభుత్వంపై వ్యతిరేకత లేదన్నారు. డాక్టర్ మంజునాథ్‌కు ఒక అవకాశం ఇవ్వాలని గెలిపించారని పేర్కొన్నారు. కనకపురలో 60 వేల మెజారిటీ వస్తుందని భావించామని, కానీ సాధ్యం కాలేదన్నారు. ఫలితాల ద్వారా ప్రజలు ఇచ్చిన సందేశాన్ని అంగీకరిస్తానన్నారు.

రామోజీరావు మార్గనిర్దేశకుడు

ఎడిటర్స్ గిల్డ్ సంతాపం

న్యూఢిల్లీ: ఈనాడు గ్రూప్ సంస్థల అధినేత రామోజీరావు (88) మృతికి ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేసింది. ఆయన ఓ మార్గనిర్దేశకుడని కొనియాడింది. ఈ మేరకు శనివారం ప్రకటన విడుదల చేసింది. 'ఎడిటర్స్ గిల్డ్ మాజీ అధ్యక్షుడు రామోజీరావు మరణం విచారకరం. మీడియా మొఘల్‌గా ప్రజల గుండెల్లో చిరస్మరణీయంగా నిలిచిన రామోజీరావు ఎన్నో మార్గాల్లో మనందరికీ మార్గనిర్దేశకులు. నిజాన్ని నిర్భయంగా మాట్లాడే గొప్ప వ్యక్తి. ఆయన ఓ ఐకాన్. మీడియా రంగానికి ఆయన చేసిన కృషి... దేశవ్యాప్తంగా జర్నలిస్టులందరిలో నిరంతరం స్ఫూర్తి కలిగిస్తుంది' అని ఎడిటర్స్ గిల్డ్ తమ ప్రకటనలో పేర్కొంది. 1987లో రామోజీరావు ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియాకు ఛైర్మన్‌గా ఎన్నికయ్యారు. పత్రికాస్వేచ్ఛ అణచివేతకు అప్పటి ప్రభుత్వం చేసిన ప్రయత్నాలను వ్యతిరేకిస్తూ ఉద్యమించడంలో కీలకపాత్ర పోషించారు.

మోదీ ప్రమాణస్వీకారానికి విదేశీ ప్రతినిధుల రాక

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి మెజారిటీ మార్కు(272) దాటేసి 293 సీట్లు గెలుపొందడంతో... మూడోసారి ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతోంది. భారత ప్రధాన మంత్రిగా నరేంద్ర మోదీ ప్రమాణస్వీకారం చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే ముహూర్తం కూడా ఖరారైంది. ఆదివారం (జూన్ 9) రాష్ట్రపతి భవన్‌లో రాత్రి 7:15 గంటలకు ఆయన ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి భారత్‌లోని ప్రముఖులతో పాటు ప్రపంచవ్యాప్తంగా కొంతమంది దేశాధినేతలు, ప్రతినిధులు హాజరు కాబోతున్నారు. ఇప్పటికే బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా దేశ రాజధాని దిల్లీకి చేరుకున్నారు. శ్రీలంక అధ్యక్షుడు రణిల్ విక్రమ సింఘే వచ్చారు. మాల్దీవుల అధ్యక్షుడు డా.మహమ్మద్ మొయిజ్జు, సీషెల్స్ ఉపాధ్యక్షుడు అహ్మద్ అఫీఫ్, మారిషస్ ప్రధాని ప్రవింద్ కుమార్ జుగ్నాథ్, నేపాల్ ప్రధాని పుష్ప కమల్ దహల్, భూటాన్ ప్రధాని షెరింగ్ టోబ్గే దిల్లీకి రాబోతున్నారు. ఈ అతిరథ మహారథుల కోసం తాజ్, లీలా, ఐటీసీ మౌర్య, క్లారిడ్జ్ వంటి హోటళ్లను భద్రత పరిధిలోకి తీసుకున్నారు. దిల్లీ పోలీసులతో పాటు పారామిలటరీ బలగాలు, బ్లాక్ కమాండోలను సైతం రాష్ట్రపతి భవన్‌తో పాటు కీలక ప్రదేశాల చుట్టూ మోహరించారు.

11 నుంచి యూపీలో కాంగ్రెస్ 'ధన్యవాద్ యాత్ర'

లక్నో: సార్వత్రిక ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్‌లో ఇండియా ఐక్యసంఘటన అద్భుత ప్రదర్శన ఇచ్చింది. 43 స్థానాలను కైవసం చేసుకుంది. ఎగ్జిట్ పోల్స్‌ను తలదన్నేలా ఫలితాలు వచ్చాయి. దీంతో హర్షం వ్యక్తంచేసిన కాంగ్రెస్... యూపీ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపేందుకు 'ధన్యవాద్ యాత్ర' నిర్వహించాలని నిర్ణయించింది. 403 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 'ధన్యవాద్ యాత్ర' ఈనెల 11 నుంచి 15వ తేదీ వరకు జరగనున్నట్లు తెలుస్తోంది. యాత్రలో పార్టీ సీనియర్లు పాల్గొనున్నారు. ధన్యవాద్ యాత్రలో భాగంగా రాజ్యాంగ ప్రతిని బహూకరించి యూపీ ప్రజలను సత్కరించనున్నారు. 80 ఎంపీ స్థానాలున్న యూపీలో 'ఇండియా'కు 43 సీట్లు రాగా బీజేపీకి 33 స్థానాలు దక్కాయి. సమాజ్‌వాదీ పార్టీ 37, కాంగ్రెస్ 6 స్థానాలను గెలుచుకున్నాయి. కాంగ్రెస్ కంచుకోట రాయ్‌బరేలీ నుంచి ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ దాదాపు నాలుగు లక్షల ఓట్లతో ఘన విజయం సాధించారు. 2019 ఎన్నికల్లో రాష్ట్రంలోని 62 స్థానాలను బీజేపీ గెలుచుకోగా.. ఎస్పీ, కాంగ్రెస్ ఒకటి, ఐదు చొప్పున స్థానాలు గెలుచుకున్నాయి.

ఐదేళ్లలో 100 శాతం పెరిగిన ఐదుగురు గుజరాత్ బీజేపీ ఎంపీల ఆస్తి

అహ్మదాబాద్: గుజరాత్ నుంచి లోక్‌సభకు రెండవసారి ఎన్నికైన 12 మందిలో ఐదుగురి ఆస్తులు నూటికి నూరుశాతం పెరిగాయి. మొత్తం 26 మంది ఎన్నిక కాగా వీరిలో 23 మంది సంపన్నులు, ఐదుగురు నేరచరితులు ఉన్నట్లు ప్రజాస్వామ్య సంస్కరణల సంస్థ (ఏడీఆర్) నివేదిక తెలిపింది. 2019-2024 అఫిడవిట్లను పరిశీలిస్తే ఐదుగురు ఎంపీల ఆస్తుల్లో 112 నుంచి 273 శాతం వరకు పెంపుదల నమోదైనట్లు పేర్కొంది. బరూచ్ నుంచి ఏడు సార్లు ఎంపీగా గెలుపొందిన బీజేపీ నేత మన్సుక్ వసావా ఆస్తి 273 శాతం పెరిగిందని తెలిపింది. 2019లో రూ.68.35లక్షలు ఉన్న ఆస్తి 2024 నాటికి రూ.2.54 కోట్లు అయిందని, అంటే రూ.1.86 కోట్ల మేర పెరిగిందని నివేదిక పేర్కొంది. లోక్‌సభ ఎంపీగా తనకు వచ్చే జీతం, బ్యాంకు వడ్డీ తదితర రూపాల్లో ఆదాయం పెరిగిందని మన్సుక్ తెలిపారు. ఆ తర్వాత స్థానంలో జామ్‌నగర్ మహిళా ఎంపీ పూనమ్ ఉన్నారు. ఈమె ఆస్తి రూ.104 కోట్ల మేర పెరిగిందని ఏడీఆర్ తెలిపింది. 2019లో రూ.42.73 కోట్లు ఉండగా ప్రస్తుతం రూ.147.70 కోట్లకు చేరినట్లు వెల్లడించింది. గుజరాత్‌లోని బీజేపీ ఎంపీలలో అనేక మంది ఆస్తులలో పెంపుదల కనిపించింది. అయితే ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, నవ్‌సారి ఎంపీ సీవీ పాటిల్ ఆస్తిలో 11శాతం క్షీణత నమోదైంది. 2019లో రూ.44.50 కోట్లున్న ఆస్తి రూ.39.49 కోట్లకు తగ్గిందని ఏడీఆర్ పేర్కొంది.

జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలకు ఈసీ కసరత్తు

జమ్ము: జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలకు రంగం సిద్ధమైంది. ఇందుకోసం కేంద్ర ఎన్నికల సంఘం కసరత్తు మొదలుపెట్టింది. రాజకీయ పార్టీలకు ఎన్నికల గుర్తులు కేటాయించే ప్రక్రియకు ఈసీఐ శ్రీకారం చుట్టింది. ఈనెల 22వ తేదీ నుంచి జమ్మూకశ్మీర్‌లో ఎన్నికల ప్రవర్తనా నిబంధనా వళి అమల్లోకి రానున్నట్లు ఎన్నికల సంఘం సెక్రటేరియట్ జారీచేసిన నోటిఫికేషన్ పేర్కొంది. జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల కోసం గుర్తుల కేటాయింపును కోరుతూ పార్టీల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని ఈసీ నిర్ణయించినట్లు నోటిఫికేషన్ పేర్కొంది. ఈ ప్రక్రియ ఎన్నికల ముందు మొదలవుతుందని, 22న ప్రవర్తనా నిబంధనావళి అమల్లోకి వస్తుందని వెల్లడించింది. జమ్మూకశ్మీర్ అసెంబ్లీకి చివరగా 2014 నవంబరులో ఎన్నికలు జరిగాయి. అప్పటి నుంచి రాజకీయ ప్రక్రియ పునరుద్ధరణ కోసం జమ్మూకశ్మీర్ పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ ఏడాది సెప్టెంబరు నాటికి అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలని సుప్రీంకోర్టు ఆదేశాలిచ్చిన క్రమంలో ఈసీఐ కసరత్తు చేపట్టింది.

పుణె కారు ప్రమాద ఘటన

నిందితుడి కుటుంబం రిసార్ట్‌పైకి బుల్డోజర్

సతారా: మహారాష్ట్రలోని పుణెలో ఇటీవల ఓ టీనేజర్ మద్యం తాగి, లగ్జరీ కారును ర్యాష్‌గా నడిపి ఇద్దరి మృతికి కారణమైన ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ ఘటనలో పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు సాగిస్తున్నారు. ఈ క్రమంలో నిందితుడికి సంబంధించి మరో వార్త బయటికొచ్చింది. ఆ టీనేజర్ కుటుంబానికి చెందిన ఓ రిసార్ట్‌లో అక్రమ కట్టడాలను అధికారులు శనివారం కూల్చేశారు. మహాబలేశ్వర్‌లోని మల్కంపేట్ ప్రాంతంలో నిందితుడి కుటుంబానికి 'ఎంపీజీ క్లబ్' పేరుతో ఓ రిసార్ట్ ఉంది. అందులో ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే కొన్ని నిర్మాణాలు చేపట్టినట్లు సమాచారం అందింది. దీనిపై గతవారం మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే స్పందించారు. అవి అక్రమ కట్టడాలని తేలితే ఆ రిసార్ట్‌పై చర్యలు తీసుకోవాలని సతారా జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. దీంతో గతవారం రిసార్ట్‌ను అధికారులు మూసివేశారు. అనంతరం దీనిపై విచారణ జరపగా ఆ కట్టడాలు అక్రమంగా నిర్మించినట్లు తేలింది. దీంతో శనివారం ఎంపీజీ క్లబ్ వద్దకు బుల్డోజర్‌ను తరలించారు. అనుమతులు లేకుండా నిర్మించిన కట్టడాలు కూల్చేసినట్లు అధికారులు వెల్లడించారు. పుణె నగరంలోని సంపన్న స్థిరాస్తి వ్యాపారి కుమారుడు... మే 19 తెల్లవారుజామున లగ్జరీ కారును వేగంగా నడిపి ఓ బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ఘటనలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరు టెకీలు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలో నిందితుడికి బెయిల్ ఇచ్చేందుకు కోర్టు విధించిన షరతులతో ఈ కేసు దేశవ్యాప్తంగా చర్చకు దారితీసింది. ఈ ఘటనలో తన కుమారుడిని తప్పించేందుకు ఆ వ్యాపారి తీవ్రంగా యత్నించాడని, కుమారుడి రక్త నమూనాలను మార్చేందుకు డాక్టర్‌కు లంచం ఇచ్చినట్లు వార్తలు వచ్చాయి. ఈ కేసులో నిందితుడితో పాటు అతడి తల్లిదండ్రులు, తాతను పోలీసులు అరెస్టు చేశారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.